

దుర్గాదేవికి సూర్యకిరణాల స్పర్శ

ఎస్.కోటలోని దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని సోమవారం ఉదయం 7.20 గంటల సమయంలో సూర్యకిరణాలు తాకాయి. తల్లి పాదాల నుంచి పైవరకు ప్రసరించడంతో భక్తులు ఆ దృశ్యాన్ని చూసి తన్మయత్వం చెందారు. - న్యూస్‌టుడే, శృంగవరపుకోట

ఆసుపత్రుల్లో వృద్ధులకు
ప్రత్యేక ఓపీ కేంద్రాలు

విజయనగరం వైద్య విభాగం, న్యూస్‌టుడే: నగరంలోని మహారాజ ప్రభుత్వ ఆసుపత్రితో పాటు ప్రాంతీయాసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వయోవృద్ధులు, సీనియర్ సిటిజన్ల కోసం ప్రత్యేక ఓపీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. మంగళవారం నుంచే ప్రారంభం కావాలని స్పష్టం చేశారు. సోమవారం సంబంధిత అధికారులతో చర్చించారు. బొబ్బిలిలో వృద్ధాశ్రమం లేకపోవడంతో కుటుంబ సభ్యులు లేని కొందరు ఇబ్బందులు పడుతున్నారని, వారి కోసం ఏదైనా ప్రభుత్వ భవనాన్ని గుర్తించాలని ఆదేశించారు.

'నా భూమిని ఆక్రమించారు'

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: గ్రామానికి చెందిన కొందరు తన భూమిని ఆక్రమించారని పూసపాటిరేగ మండలం కొల్లాయవలస గ్రామానికి చెందిన ఎత్తుల ఆదినారాయణ అర్జీ ఇచ్చారు. సర్వే నంబరు 125-2లో 2.04 ఎకరాల డి-పట్టా భూమి తాత, తండ్రుల నుంచి సంక్రమించిందని తెలిపారు. ఇటీవల భూమిలో వేసుకున్న ఉలవచేను, కొబ్బరి మొక్కలను రాత్రి సమయాల్లో దౌర్జన్యంగా తొలగించి దున్నించారని స్థానికులతో కలిసి వచ్చి విన్నవించారు. దీనిపై విచారణ చేసి తన భూమిని అప్పగించాలన్నారు.


అర్జీ చూపిస్తున్న ఆదినారాయణ

221 వినతులు..: కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 221 అర్జీలు అందాయి. భూ సమస్యలకు సంబంధించి రెవెన్యూ శాఖకు 151 వినతులు రాగా, పింఛన్లు-18, పురపాలక-14, పంచాయతీ శాఖ-12, విద్యా శాఖ-8 ఉన్నాయి. వాటిని పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. సంయుక్త కలెక్టర్ సేథు మాధవన్, డీఆర్వో ఎస్.డి.అనిత పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు వేళాయె



ఈనాడు - విజయనగరం

ప్రస్తుత ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి 29 నాటికి ముగుస్తుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం ఉపాధ్యాయుల ఓటరు జాబితా తయారీ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాలో అర్హులైన వారు ఓటుహక్కు నమోదు చేసుకోవడానికి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది.

ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో 34 మంది ఈఆర్వోలు, 187 మంది ఏఈఆర్‌వోలను నియమించారు. ఈఆర్‌వోగా విశాఖ జిల్లా డీఆర్వో వ్యవహరిస్తారు. అర్హులైన ఉపాధ్యాయులు ఆయా జిల్లాల పరిధిలో నియమించిన అధికారులకు ఓటు దరఖాస్తులు అందజేయవచ్చు. ఆన్‌లైన్‌లో సీఈఓ ఆంధ్ర వెబ్‌సైట్‌లో ఫారం 19ను సమర్పించవచ్చు.

వీరు అర్హులు

★ ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు సెకండరీ స్థాయి (ఆరో తరగతికి పైబడిన) పాఠశాలల్లో రెగ్యులర్ లేదా అడ్‌హాక్ ప్రాతిపదికన పనిచేసే ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఓటు నమోదుకు అర్హులు. పార్ట్‌టైమ్ పద్ధతిలో పనిచేసే వారు అర్హులు కాదు. ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు స్వీయ ధ్రువీకరణ పత్రం, సంబంధిత హెచ్‌ఓడీలు ఇచ్చే ధ్రువపత్రంతో పాటు జిల్లా విద్యాశాఖ అధికారి కౌంటర్ సైన్ చేసిన పత్రాలను సమర్పించాలి.

★ కళాశాల అధ్యాపకులైతే ఆర్జేడీల నుంచి, వర్సిటీ స్థాయిలో అయితే వీసీ నియమించిన అధికారుల నుంచి కౌంటరు సైన్ తీసుకోవాలి. గత ఆరేళ్లలో (01.11.2024 నుంచి వెనక్కి లెక్క పెడితే) సెకండరీ స్థాయికి మించిన ఏ విద్యాసంస్థలో అయినా మూడేళ్లకు తగ్గకుండా పనిచేసిన ఉపాధ్యాయులు మాత్రమే అర్హులు. గతంలో ఓటరుగా ఉన్నవారు సైతం మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు.

★ ఓటు నమోదుకు గడువు: **నవంబరు 6**
★ ముసాయిదా జాబితా: **నవంబరు 23**
★ అభ్యంతరాల స్వీకరణ: **డిసెంబరు 9 వరకు**
★ తుది ఓటరు జాబితా: **డిసెంబరు 30**

8 పోలింగ్ కేంద్రాల మార్పు

హేతుబద్ధీకరణలో గజపతినగరం నియోజకవర్గంలో తమటాడ, ఎం.కొత్తవలస, ఎస్.కోటలోని మంగళపాలెంలోని మూడు, వేపాడ మండలం డబ్బిరాజుపేట, రాజాంలో వంగర మండలం లక్ష్మీపేటలోని పోలింగ్ కేంద్రాల మార్పునకు ప్రతిపాదిస్తున్నారు. ఇవి కాకుండా ఇతర కేంద్రాలేమైనా మార్పునకు రాజకీయ పార్టీలు ప్రతిపాదిస్తే పరిశీలిస్తారు.

జనాభా-ఓటర్ల మధ్య వ్యత్యాసం


రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో సమావేశమైన కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం, ఈనాడు: జిల్లాలో జనాభా, ఓటర్ల నిష్పత్తికి మధ్య అధిక వ్యత్యాసం ఉందని, దాన్ని సవరించాలని కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితా తయారీ, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై చర్చించారు. గజపతినగరం, విజయనగరం నియోజకవర్గాల్లో పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపొందించాలని ఆర్డీవో కీర్తిని ఆదేశించారు.

పర్యాటక కేంద్రంగా కోట

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: విజయనగరం ఉత్సవాల్లో భాగంగా సందర్శకుల కోసం కోట సుందరీకరణ పనులు ప్రారంభించాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. చారిత్రక వారసత్వ సంపదని, పర్యాటక స్థలంగా తీర్చిదిద్దుతామన్నారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో కలిసి సోమవారం ఆ ప్రాంతాన్ని సందర్శించారు. మంగళవారం నుంచే పనులు ప్రారంభించాలని స్పష్టం చేశారు. రోజూ పరిశీలించాలని ఆర్డీవో దాట్ల కీర్తిని ఆదేశించారు. కోట గోడకు అన్ని వైపులా విద్యుత్తు దీపాలు ఏర్పాట్లు చేయాలని, కందకాలను స్వచ్ఛమైన నీటితో నింపాలన్నారు. వెనుక వైపు ఖాళీ స్థలంలో కూర్చొనేందుకు వీలుగా తీర్చిదిద్దాలన్నారు. దక్షిణం వైపు లేజర్ షో ఏర్పాటు చేయాలన్నారు. గోడపక్కన నివాసముంటున్న 16 కుటుంబాలకు పునరావాసం కల్పించాలని తహసీల్దారు కూర్మారావుకు సూచించారు. సోనియానగర్‌లో వారికి టిడ్కో ఇళ్లను కేటాయించాలని ఆదేశించారు.

జే బ్రాండ్‌కు స్వస్తి

ఇక ప్రైవేటు మద్యం అమ్మకాలు

నేటి నుంచి నూతన విధానం అమలు

ఈనాడు-విజయనగరం న్యూస్‌టుడే-రాజాం

రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం విధానాన్ని మంగళవారం నుంచి అమలు చేయనుంది. సర్కారీ వారి మందు దుకాణాల్లో అమ్మకాలకు సోమవారంతో తెరపడింది. వైకాపా పాలనలో నూతన విధానం తీసుకొచ్చి ప్రభుత్వ దుకాణాలు తెరిచింది. జె-బ్రాండ్ల పేరుతో నాసిరకం అమ్మకాలు చేపట్టింది. ప్రతిపక్షాలు, మందుబాబులు గగ్గోలు పెట్టినా వెనక్కి తగ్గలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలు, మద్యం ధరలు, నాణ్యతపై అధ్యయనం చేసి నూతన విధానానికి శ్రీకారం చుట్టింది.

అధికారంలోకి వస్తే నాణ్యమైన మద్యం అందుబాటులోకి తెస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహా కూటమి నేతలు ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. దాన్ని ఇప్పుడు అమలు చేయనున్నారు. ఇకపై మందుబాబులు కోరుకునే అన్ని బ్రాండ్లకు అనుమతివ్వనుంది. తక్కువ ధర విభాగంలో క్వార్టర్ బాటిల్ మద్యాన్ని రూ.100 లోపే అందుబాటులో ఉంచుతామని ప్రకటించింది. వైకాపా ప్రభుత్వ హయాంలో క్వార్టర్ బాటిల్ మద్యం సుమారు రూ.200 వరకు ఉండేది. దీంతో యువత గంజాయి, మత్తు పదార్థాల వైపు మొగ్గుచూపారనే ఆరోపణలు వినిపించాయి. వీటిని దృష్టిలో ఉంచుకొని రూ.99 లోపే ధర ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది.

దోపిడీకి తెర

వైకాపా ప్రభుత్వం అయిదేళ్లలో మద్యం పేరుతో తెరతీసిన దోపిడీకి అక్టోబరు ఒకటితో తెరపడనుంది. నాసిరకం మద్యంతో మందుబాబుల జేబులు, ఆరోగ్యం గుల్లచేసింది. అయిదేళ్లలో రూ.6,876 కోట్ల విలువైన నాసిరకం మద్యం తాగించింది. ప్రస్తుతం రెండు జిల్లాల్లో 202 దుకాణాల్లో రోజుకు సగటున రూ.4 కోట్లకు పైగా విక్రయిస్తున్నారు. కొత్త దుకాణాల లైసెన్సులు దక్కించుకునేందుకు ప్రైవేటు వ్యాపారులు ఆరాటపడుతున్నారు.



కూడికలు, తీసివేతల్లో తలమునకలై ఉన్నారు. గతంలో ఈ వ్యాపారంలో అనుభవం ఉన్న వారు తమ అనుచరులతో దరఖాస్తు చేయించాలని నిర్ణయించారు. తక్కువ జనాభా, ఎక్కువ వ్యాపారం జరిగే గ్రామీణ ప్రాంత దుకాణాలపై ఎక్కువ మంది కన్నేశారు. నూతన విధానం అమలు విషయమై విజయనగరం ఎక్సైజ్ శాఖ ఉప కమిషనర్ బాబ్జీరావు వద్ద 'ఈనాడు' ప్రస్తావించగా ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నామని చెప్పారు. నోటిఫికేషన్‌కు అనుగుణంగా చర్యలు చేపడతామని ఆయన పేర్కొన్నారు.

స్వల్పంగా పెరిగే అవకాశం

నూతన మద్యం విధానంలో ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ దుకాణాల కన్నా స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది. గీత కార్మికులకు (గౌడ, ఈడిగ) రిజర్వ్ చేసిన దుకాణాలకు రెండురోజుల్లో పాలసీ రానుంది. ప్రాథమిక సమాచారం ప్రకారం... విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో 202 దుకాణాలు ఉండగా ప్రస్తుతం 223 మద్యం దుకాణాలకు అనుమతివ్వనున్నట్లు సమాచారం.

ఉభయ జిల్లాల్లో ఇలా..

జిల్లా	సాధారణ దుకాణాలు	గీతకార్మికులకు కేటాయించినవి	మొత్తం
విజయనగరం	149	16	165
మన్యం	53	05	58

రెండు జిల్లాల్లో 223 దుకాణాలు

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో 223 ప్రైవేటు మద్యం దుకాణాలు తెరవనున్నట్లు సమాచారం. అక్టోబరు ఒకటి నుంచి తొమ్మిది వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తారు. అందిన దరఖాస్తుల్లో ఒక్కో దుకాణాన్ని లాటరీ ద్వారా ఎంపిక చేస్తారు. దీనికి సంబంధించి సోమవారం రాత్రి గెజిట్ నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని, దాని కోసం ఎదురుచూస్తున్నట్లు ఎక్సైజ్ యంత్రాంగం చెప్పింది.

నాలుగు శ్లాబుల్లో లైసెన్స్‌లు

నూతన మద్యం విధానం ద్వారా అమ్మకాలకు ఎక్సైజ్ అధికార యంత్రాంగం కసరత్తు పూర్తి చేసింది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తోంది. జనాభా ప్రాతిపదికన నాలుగు స్లాబుల్లో లైసెన్స్‌దారుల నుంచి సెక్యూరిటీ డిపాజిట్ వసూలు చేయనుంది. 10 వేల జనాభాలోపు రూ.5 లక్షలు.. 50 వేల లోపు రూ.50 లక్షలు.. 50 వేలు దాటి లక్ష జనాభా లోపు రూ.65 లక్షలు.. లక్ష జనాభా దాటిన తర్వాత రూ.85 లక్షలు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఏ ప్రాంత, ఏ రాష్ట్రానికి చెందిన వ్యక్తి అయినా మద్యం దుకాణానికి దరఖాస్తు చేసుకోవచ్చు.

నిర్ణీత సమయానికే సిరిమాను ఊరేగింపు


ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఆర్డీవో కీర్తి

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: పైడితల్లి సిరిమానోత్సవ సంబరాలకు సకాలంలో ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆర్డీవో దాట్ల కీర్తి ఆదేశించారు. నిర్ణీత సమయానికే సిరిమాను తిరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని దేవాదాయ, అటవీ అధికారులకు సూచించారు. తన కార్యాలయంలో సోమవారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. బారికేడ్లను పక్కాగా పెట్టాలని, రెండంచెల భద్రత నిర్వహించాలని సూచించారు. పారిశుద్ధ్యం, తాగునీరు, బయో మరుగుదొడ్లు తదితర అంశాలపై ఆరా తీశారు. పండగ రోజుల్లో మూడు షిఫ్ట్‌ల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని, కంట్రోల్‌రూంల ఏర్పాటు చేయాలని కోరారు. ఈవో ప్రసాదరావు, ఆర్అండ్‌బీ డీఈఈ శ్రీనివాసరావు, డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


అందరి భాగస్వామ్యంతో ఉత్సవాలు

విజయనగరం ఉత్సవాల నిర్వహణలో అందరినీ భాగస్వామ్యం చేయాలన్నదే జిల్లా యంత్రాంగం ఉద్దేశమని కలెక్టర్ అంబేడ్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. అధికారులతో పాటు జీవితకాల సభ్యులకు బాధ్యతలు అప్పగించనున్నామన్నారు. 13, 14వ తేదీల్లో 12 వేదికల వద్ద కార్యక్రమాలు ఉంటాయని, 50 మంది జీవితకాల సభ్యులను వాటి వద్ద సర్దుబాటు చేయనున్నామని చెప్పారు.

అభ్యర్థులకు ఇబ్బందులు రానీయొద్దు

విద్యావిభాగం, న్యూస్‌టుడే: పైడితల్లి సిరిమానోత్సవం, విజయనగరం ఉత్సవాల నేపథ్యంలో టెట్ రాసే అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. తన ఛాంబర్లో సంబంధిత ఏర్పాట్లపై సమీక్షించారు. వచ్చే నెల 3 నుంచి 21 వరకు ఆన్‌లైన్‌లో పరీక్షలు జరగనున్నాయని, కేంద్రాల్లో విద్యుత్తుకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఆర్టీసీ సర్వీసులను తిప్పాలని, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సందేహాల కోసం సహాయక కేంద్రాలను ప్రారంభించాలని ఆదేశించారు.

బిందె నిండా నీరు


బాడంగి, బొబ్బిలి, దత్తిరాజేరు, మెంటాడ, రామభద్రపురం మండలాలకు తోటపల్లి జలాశయం ద్వారా నీరు అందించనున్నారు.

ప్రజల దాహార్తి తీర్చేందుకు.. భవిష్యత్తులో తాగునీటి సమస్యలు తలెత్తకుండా కూటమి ప్రభుత్వం 'వాటర్ గ్రిడ్' పథకాన్ని మళ్లీ తెరపైకి తీసుకొచ్చింది. 2019లోనే ఈ పథకం అమలుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఆపై అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం పక్కన పెట్టింది.
న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం

జిల్లాలోని ప్రాజెక్టుల ద్వారా ఆయకట్టు భూములకు అందించగా మిగిలిన జలాలను వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. 27 మండలాల్లో 2011 లెక్కల ప్రకారం 17,81,671 మంది ఉన్నారు. 2057 నాటి జనాభాకు అనుగుణంగా ఎంత నీరు అవసరమో లెక్కించి, ప్రతిపాదనలు తయారు చేశారు. ఒక్కో మనిషికి 55 లీటర్ల చొప్పున అందించాల్సి ఉంది. ఆ ప్రకారం ప్రాజెక్టుల ద్వారా రెండు టీఎంసీల నీరు అవసరమని అంచనా వేశారు.

● తెరపైకి 'వాటర్ గ్రిడ్' పథకం

జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటి కుళాయిలు వేసినా పూర్తిస్థాయిలో నీరు అందే పరిస్థితి లేదని ఇటీవల చేపట్టిన పల్స్ సర్వే ద్వారా తేలింది. ఇంకా చాలా గ్రామాలకు కుళాయిలు కూడా వేయకుండా వదిలేశారు. ఇవన్నీ పరిశీలించిన ప్రభుత్వం పథకాన్ని తెరపైకి తెచ్చింది. సాధ్యాసాధ్యాలు పరిశీలించి వచ్చే మూడేళ్లలో 'వాటర్ గ్రిడ్' పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిసింది.

ఏ ప్రాజెక్టు నుంచి ఎలా?

★ బాడంగి, బొబ్బిలి, దత్తిరాజేరు, మెంటాడ, రామభద్రపురం మండలాలకు తోటపల్లి ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించాలని ప్రతిపాదించారు. ★ భోగాపురం, డెంకాడ, నెల్లిమర్ల, పూసపాటిరేగ మండలాలకు తారకరామ తీర్థసాగర్. ★ బొండపల్లి, గజపతినగరం, జామి, గంట్యాడ, కొత్తవలస, ఎల్.కోట, ఎస్.కోట, వేపాడ, విజయనగరం మండలాలకు తాటిపూడి రిజర్వాయర్. ★ చీపురుపల్లి, గరివిడి, గుర్ల, మెరకముడిదాం, రాజాం, రేగిడి ఆమదాలవలస, సంతకవిటి, వంగర, తెర్లాం మండలాలకు మడ్డువలస ప్రాజెక్టు.

త్వరలో చర్చిస్తాం

ఇటీవల ఇంజినీరింగు అధికారులు ప్రాజెక్టులను పరిశీలించి అంచనాలు తయారు చేసి అందించారు. త్వరలో సాగునీటి ప్రాజెక్టు అధికారులతో నీరు ఇచ్చే అంశంపై చర్చించిన తర్వాత ఒక నిర్ణయానికి వస్తాం.
- ఉమాశంకర్, ఎస్ఈ ఆర్ డబ్ల్యూఎస్, విజయనగరం

నైపుణ్యాల పెంపుపై దృష్టి


మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాలనలో యువత భాగస్వామ్యం కావాలని మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర- 2047 దార్శనిక పత్రం రూపకల్పనలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో ఆయన మాట్లాడారు. యువతి, యువకుల్లో డిజిటల్ నైపుణ్యాల పెంపొందించడం ద్వారా ప్రపంచ స్థాయిలో పోటీపడగలరని పేర్కొన్నారు. ఎమ్మెల్యే లోకం నాగమాధవి మాట్లాడుతూ భోగాపురం విమానాశ్రయం ద్వారా పెద్దఎత్తున ఎగుమతులు చేయడానికి వీలుగా నాణ్యమైన అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులపై దృష్టి సారించాలని కోరారు. కలెక్టర్ అంబేడ్కర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కోండ్రు మురళీమోహన్, అదితి గజపతిరాజు, ఐటీ పరిశ్రమ నిపుణుడు లోకం ప్రసాద్, జాతీయ కాయిర్ బోర్డు ప్రతినిధి ఎం.శ్రీనివాసరావు, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బి.సూర్యనారాయణ, జేసీ సేథు మాధవన్, సీపీవో బాలాజీ, డీఆర్వో అనిత పాల్గొన్నారు.

ఉందా.. జాతీయ భాగ్యం

విజయనగరం - పాలకొండ రోడ్డు అభివృద్ధికి ప్రతిపాదన

గత పాలకులు రహదారుల విస్తరణను పూర్తిగా విస్మరించారు. విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలతో పాటు ఒడిశాకు రాకపోకలు సాగించడానికి కీలకమైన విజయనగరం - పాలకొండ మార్గాన్ని అయిదేళ్లూ నిర్లక్ష్యం చేశారు. దీనిని ఒడిశా రాష్ట్రం హద్దుబంగి వరకు జాతీయ రహదారిగా ఉన్నతీకరించాలని గత 25 ఏళ్లుగా ప్రతిపాదన ఉంది. - న్యూస్‌టుడే, గరివిడి, చీపురుపల్లి


ఉన్నతీకరించాల్సిన ప్రధాన రహదారి

రాష్ట్రంలో అత్యధిక ట్రాఫిక్ ఉన్న 3,059 కిలోమీటర్ల పొడవున ఉన్న 31 రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చాలని రాష్ట్ర రహదారుల భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి.. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని ఇటీవల కోరారు. అందులో 70.31 కి.మీ ఉన్న విజయనగరం-పాలకొండ ప్రధాన రహదారి ఒకటి. దీనిని విస్తరిస్తే రవాణా సదుపాయం మెరుగుపడి నెల్లిమర్ల, చీపురుపల్లి, రాజాం, పాలకొండ నియోజకవర్గాలు పారిశ్రామికంగా, విద్య, వైద్యపరంగా అభివృద్ధి చెందుతాయి. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించి.. వలసలు తగ్గుముఖం పట్టే అవకాశముంది.

గతంలో రూ.613 కోట్లతో..

తెదేపా ప్రభుత్వ హయాంలో 2016 డిసెంబరు 8న పీపీపీ విధానంలో ఈ రహదారిని అభివృద్ధి చేసేందుకు రూ.613.91 కోట్లతో పరిపాలనాపరమైన అనుమతులిచ్చారు. ఒక కి.మీ రహదారి నిర్మాణానికి రూ.5.42 కోట్లు వ్యయం అవుతుందని అంచనాలు సిద్ధం చేశారు. చీపురుపల్లి, గరివిడి, నెల్లిమర్ల, రాజాం పట్టణాల వద్ద బైపాస్‌లు నిర్మించాలని ప్రతిపాదించారు. ఆ మేరకు హద్దుబంగి వరకు జాతీయ రహదారిగా ఉన్నతీకరించాలంటూ నాటి కేంద్రమంత్రి పి.అశోక్‌గజపతిరాజు కేంద్ర ప్రభుత్వానికి విన్నవించారు. తాజాగా కూటమి ప్రభుత్వం పీపీపీ విధానంలో అభివృద్ధి చేయాలని ఇప్పటికే నిర్ణయించింది. మరోవైపు కేంద్రమంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర ర.భ.శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి దిల్లీలో కేంద్ర మంత్రి గడ్కరీని కలిసి అభివృద్ధి చేయాలంటూ కోరారు.

స్వర్ణమయం.. కోటదుర్గమ్మ

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ కోటదుర్గమ్మ ఆలయంలో ఈ ఏడాది దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. సుమారు రూ.24.19 లక్షలతో 108 మంది భక్తులు సమకూర్చిన 108 బంగారు పుష్పాలతో పూజలు చేయనున్నారు. ఇప్పటికే భక్తులు సమర్పించిన రూ.45 లక్షల విలువైన బంగారు కిరీటం, రూ.11 లక్షల విలువైన ఆభరణాలు ఉన్నాయి. వీటిని ఉత్సవాల నేపథ్యంలో పది రోజుల పాటు అమ్మవారికి అలంకరించనున్నారు. వీటితో పాటు స్వర్ణ పుష్పార్చన జరగనుంది. ఇందుకు దేవదాయశాఖ ఉన్నతాధికారుల నుంచి అనుమతులు పొందినట్లు ఈవో వి.వి.సూర్యనారాయణ తెలిపారు. అమ్మవారి దర్శనం ఉచితంగానే ఉంటుందని, శీఘ్రదర్శనానికి రూ.30, ప్రత్యేక దర్శనానికి రూ.100, సంబరఘటాలకు రూ.200, స్వర్ణ పుష్పార్చనకు రూ.300, పెద్దవాహనాల పూజకు రూ.వంద, ద్విచక్ర వాహన పూజకు రూ.50, కుంకుమపూజకు రూ.50, పది రోజులు కుంకుమ పూజకు రూ.500, చిన్నతీర్థం రూ.25, పెద్ద తీర్థం రూ.వంద చొప్పున టికెట్ ఖరారు చేసినట్లు చెప్పారు.

యువతలో మార్పునకు 'సంకల్పం'


ప్రతిజ్ఞ చేస్తున్న సాయికుమార్, పోలీసులు

బొబ్బిలి, న్యూస్‌టుడే: యువతలో మార్పు కోసం 'సంకల్పం' తీసుకువచ్చాం.. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని కళాశాల స్థాయి నుంచే ప్రతిజ్ఞ బూనాలని పోలీసు శాఖ పిలుపునిచ్చింది. సోమవారం పట్టణంలోని సూర్య రెసిడెన్సిలో 'సంకల్పం' కార్యక్రమాన్ని చేపట్టారు. నటుడు సాయికుమార్ అతిథిగా హాజరై, మాట్లాడారు. 'చాలా మంది ఒత్తిడిని తట్టుకోలేక, ఇతర సమస్యలతో మత్తుకు అలవాటు పడుతున్నారు. ఇది సరైన మార్గం కాదు. నేనూ బాధలు అనుభవించే ఈస్థాయికి వచ్చా. నా తొలి సంపాదన రూ.250 తల్లిదండ్రుల చేతిలో పెట్టినప్పుడు వారి ఆనందాన్ని మాటల్లో చెప్పలేను. కన్నవారి మనసు గెలుచుకోవాలంటే విద్యార్థులు లక్ష్యంతో ముందుకు వెళ్లాలి' అని చెప్పారు. మత్తుకు బానిస అయితే ఆర్థికంగా చితికిపోయి జీవితాలు నాశనం అవుతాయని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. డీఎస్పీలు శ్రీనివాసరావు, రాఘవులు, సీఐలు సతీష్‌కుమార్, నారాయణరావు, ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాల కరస్పాండెంటు రౌతు వాసుదేవరావు, ఎస్ఐలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్యాలు, నాటకాలు ఆకట్టుకున్నాయి.

సిటీస్కాన్ సేవల పునరుద్ధరణ



పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: పార్వతీపురంలోని జిల్లా ఆసుపత్రిలో సిటీస్కాన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. సాంకేతిక లోపంతో యంత్రం ఇటీవల పని చేయలేదు. దీంతో రోగులు స్కానింగ్ కోసం బయటకు వెళ్లి రూ.3 వేల వరకు ఖర్చు చేసేవారు. వారిపై ఆర్థిక భారం పడుతోందని గతనెల 27న 'ఈనాడు'లో 'ఆగాయ్.. సిటీ స్కాన్ సేవలు' శీర్షికతో కథనం వెలువడింది. దీనిపై సూపరింటెండెంట్ వాగ్దేవి, ఆర్ఎంవో శ్యామల, కేంద్రం నిర్వాహకులు స్పందించారు. రూ.31,700తో యంత్రం బాగు చేశారు. దీంతో ఆదివారం నుంచి సేవలు అందుబాటులోకి వచ్చాయి.

ఈనాడు కథనానికి స్పందన

మూడు వాహనాల పట్టివేత

ఈనాడు, విజయనగరం, దత్తిరాజేరు, న్యూస్‌టుడే: నిబంధనలకు విరుద్ధంగా పశువులను తరలిస్తున్న మూడు వ్యాన్‌లను పట్టుకున్నట్లు పెదమానాపురం ఎస్సై జయంతి తెలిపారు. వాహనాల్లో 19 పశువులు ఉన్నాయని, సదరు వ్యక్తులపై కేసులు నమోదు చేశామని తెలిపారు. ఈ ప్రాంతం నుంచి అక్రమంగా పశువుల రవాణాపై సోమవారం ఈనాడులో 'పెదమానాపురం టు కేరళ' శీర్షికతో వచ్చిన కథనానికి స్పందించారు. సంత యాజమాన్యం బాధ్యతగా ఉండాలని, నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ★ పశు అక్రమ రవాణాపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. ఈమేరకు రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పశుసంవర్ధక శాఖ రాష్ట్ర సంచాలకుడు, జిల్లా కలెక్టర్, ఎస్పీకు లేఖలు రాశారు. ప్రభుత్వ యంత్రాంగానికి తగిన ఆదేశాలు ఇవ్వాలని అందులో పేర్కొన్నారు.

తెలంగాణ డీఎస్సీలో మెరిసిన శ్రీరామ్



శ్రీరామ్

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: తెలంగాణ డీఎస్సీ ఫలితాల్లో విజయనగరంలోని భవానీనగర్‌కు చెందిన కె.వి.ఎన్.శ్రీరామ్ గణితం విభాగంలో(స్కూల్ అసిస్టెంట్) మొదటి ర్యాంకు సాధించాడు. 100కు 84.83 మార్కులు లభించాయి. 2022, 2023 తెలంగాణ టెట్‌లో ప్రతిభ కనబర్చాడు. రెండు సార్లు వరుసగా మూడో స్థానంలో నిలిచాడు. 2022 ఏపీ టెట్‌లో 150కి 129 మార్కులు పొందాడు. ప్రస్తుతం ఏపీ డీఎస్సీకి సిద్ధమవుతున్నాడు. బీటెక్ చేసిన ఈ అభ్యర్థి ప్రభుత్వ ఉద్యోగం సాధించే ప్రయత్నంలో ఉపాధ్యాయ వృత్తిలోకి వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. తొలుత సచివాలయం సంక్షేమ సహాయకునిగా ఎంపికై, కొన్ని నెలలకే ఉద్యోగం వదులుకుని డీఎస్సీకి సిద్ధమవుతున్నట్లు చెబుతున్నాడు.

బంతిపూలు.. రైతు ఇంట సిరులు



రామభద్రపురంలో పువ్వుల్ని తీస్తున్న మహిళా రైతులు

రామభద్రపురం, న్యూస్‌టుడే: బంతిపూలు రైతులకు సిరులు కురిపిస్తున్నాయి. గత మూడు నెలలుగా రూ.50 ఉన్న కేటు ధర ఇప్పుడు రూ.200 పలుకుతోంది. ఈసారి సాగు కూడా బాగుందని, గతంతో పోల్చితే అధిక ఆదాయం అందుకుంటున్నామని రైతులు చెబుతున్నారు. రామభద్రపురం పంచాయతీలో దాదాపు 350 మంది రైతులు బంతి పూలు సాగు చేస్తున్నారు. ఒక్కో రైతు 20 సెంట్లు నుంచి 30 సెంట్ల వరకూ మొక్కలు నాటారు. ప్రస్తుతం రామభద్రపురం మార్కెట్‌లో రైతుల నుంచి కొనుగోలు చేసి బొబ్బిలి, గజపతినగరం, విజయనగరం ప్రాంతాలకు వ్యాపారులు తరలిస్తున్నారు. దసరా, కార్తిక మాసం, స్వాముల పూజలు రాబోతున్న నేపథ్యంలో గిరాకీ పెరుగుతుందని అంటున్నారు.

ఈ ఏడాది కలిసొచ్చింది..



పువ్వుల సాగు కలిసొచ్చింది. నేను 20 సెంట్ల భూమిలో బంతి పూల సాగుకు రూ.10 వేలు పెట్టుబడి పెట్టాను. ఇప్పటివరకు పలుమార్లు పువ్వులు కోయగా రూ.25 వేలు ఆదాయం వచ్చింది. ఇంకా పంట ఉంది.

- తూముల తిరుపతి, రైతు

ఇబ్బందులు తీరుతున్నాయి..



ప్రతి సంవత్సరం మేము పూలు సాగు చేస్తున్నాం. ఈ ఏడాది 30 సెంట్ల భూమిలో చేపట్టాం. మార్కెట్లో ప్రస్తుతం బుట్ట రూ.200కు కొనుగోలు చేస్తున్నారు. దసరా వస్తే పూల ధర రూ.400 వరకూ పెరిగే అవకాశం ఉంది. ఆర్థిక కష్టాలు తీరుతున్నాయి.

- కె.రాములు, రైతు

అవగాహన కల్పిస్తాం: బంతి పూల సాగును పెంచేందుకు చర్యలు తీసుకుంటాం. ఇందులో అధిక దిగుబడులు సాధించడానికి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తాం. ప్రభుత్వ రాయితీలను రైతులకు అందిస్తాం. ఈ ఏడాది మెరుగైన ఆదాయం వచ్చింది. - మోహన్‌కృష్ణ, ఉద్యాన శాఖ అధికారి, రామభద్రపురం

అప్రమత్తతతో అగ్గితెగులు నివారణ



కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: వరి పంటకు సోకే ప్రమాదకర తెగుళ్లలో అగ్గి తెగులు ప్రధానమైంది. ముదురు గోధుమ రంగు అంచుతో మధ్యలో బూడిద రంగు మచ్చలు ఏర్పడి ఆకులు ఎండిపోతాయి. తీవ్రత ఎక్కువ అయితే వెన్నులు విరిగి పోతాయి.

ఇలా చేస్తే మేలు.. నాణ్యమైన విత్తనాలు సాగు చేయాలి. ◆ కిలో విత్తనానికి 3 గ్రాములు కార్బండజిమ్ కలిపి విత్తనశుద్ధి చేయాలి. ◆ లీటరు నీటిలో ట్రైసైక్లోజోల్ 75 శాతం 0.6 గ్రాములు లేదా ఎడిఫెన్ఫాస్ ఒక మిల్లీ లీటరు కలిపి పైరుకు పిచికారీ చేయాలి. ◆ అవసరానికి తగినంత యూరియా వేయాలి. ◆ చేనులోని గట్లపై కలుపు తొలగించాలి. ఇలా చేస్తే అగ్గి తెగులు నియంత్రించవచ్చని కురుపాం మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరావు తెలిపారు.

రైతేరాజు

బొప్పాయిలో యాజమాన్య పద్ధతులు

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: బొప్పాయి పోషకాల గని. వాతావరణంలో మార్పులతో తెగుళ్లు విజృంభించి పంటను దెబ్బతీస్తున్నాయి. సకాలంలో సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకుంటే మంచి ఫలసాయం పొందొచ్చని రస్తాకుంటుబాయి కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త డా.ఎస్.శ్రీనివాసరాజు సూచించారు.

కాండం కుళ్లు తెగులు: మొక్క వేర్లు, మొదలు కుళ్లిపోతాయి. లీటరు నీటిలో బోర్డో మిశ్రమం 1 శాతం లేదా అలియేట్ 2 గ్రాములు కలిపి వారం వ్యవధిలో 2-4 సార్లు మొదలును తడపాలి. తెగులు ఉద్ధృతి ఎక్కువుంటే లీటరు నీటికి 2 గ్రాముల రిడోమిల్ ఎం.జడ్ కలిపి మొదళ్లలో వేయాలి.



తెగులు సోకిన మొక్క

బూడిద తెగులు: ఆకులు, కాడలు, కొత్త చిగుళ్లపై తెలుపు రంగు శిలీంద్రం వస్తుంది. నీటిలో కరిగే గంధకం 3 గ్రా.లేదా కెరాథేన్ మి.లీ కలిపి పిచికారీ చేయాలి.

పక్షి కన్ను: ఆకులు, కాయలపై వలయాకార నీటి మచ్చలు ఏర్పడతాయి. కాయల నాణ్యత, దిగుబడి తగ్గుతుంది. లీటరు నీటికి హెక్సాకొనజోల్ 2 మి.లీ కలిపి కోతకు 30-40 రోజుల ముందు పిచికారీ చేయాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. బొప్పాయి నారులో రసం పీల్చే పురుగు చొరబడకుండా నైలాన్ మెష్ నెట్ హౌస్‌లో పెంచాలి. పొలం చుట్టూ రక్షణగా అవిశ, పొడవాటి సజ్జ, జొన్న, మొక్కజొన్న రెండేసి వరుసలగా వేసుకుంటే రసం పీల్చే పురుగును నియంత్రించొచ్చు. ★ జిగురు పూసిన పసుపు రంగు అట్టలను ఎకరాకు 12-15 చొప్పున అమర్చాలి. ★ మొక్క నాటే 3 రోజుల ముందు ఎసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ★ రసం పీల్చే పురుగు నివారణకు వేపనూనె 2.5 మి.లీ+ఎసిఫేట్ 2.5గ్రా+జిగురు 0.5 మి.లీ. నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో పురుగు ఉద్ధృతి బట్టి పిచికారీ చేయాలి.

చలికాలం సంరక్షణ అవసరం



గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: చలికాలం సమీపిస్తున్న తరుణంలో జీవాల పెంపకంలో సరైన సంరక్షణ చర్యలు చేపట్టాలని జియ్యమ్మవలస పశువైద్యాధికారి **మునికుమార్** తెలిపారు. రైతులు ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

? జీవాల్లో నట్టల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టాలి?
– సన్యాసిరావు, మానాపురం

● జీవాల్లో సకాలంలో నట్టలు నివారించకపోతే బరువు పెరగడంతో పాటు రక్తహీనతకు గురవుతాయి. ప్రతి 3, 4 నెలలకు విధిగా పేడ పరీక్ష చేయించి వైద్యుల సలహాతో డీవార్మింగ్ ద్రావణాలు వాడాలి.

? దూడ పుట్టినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.?
– ఆదినారాయణ, పాచిపెంట

● దూడ పుట్టిన వెంటనే ముక్కు రంధ్రాలు, నోటి నుంచి వచ్చే జిగురు తుడిచి శుభ్రం చేయాలి. దూడ బొడ్డును కత్తిరించిన తర్వాత అయోడిన్ ద్రావణాన్ని పూయాలి. దూడకు అరగంట లోపు జున్నుపాలను తాగించడంతో రోగనిరోధక శక్తి కలిగి మలబద్ధకం సమస్యను అరికట్టవచ్చు.

ఫోన్ కొట్టు.. సలహా పొందు

ఖరీఫ్‌లో సాగవుతున్న వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటల్లో యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణకు ఎలాంటి సస్యరక్షణ చర్యలు చేపట్టాలి వంటి సలహాల కోసం 95739 59680 నంబరును సంప్రదించాలని భామిని వ్యవసాయాధికారి సింహాచలం తెలిపారు.

మహిళకు గౌరవం ఇంటి నుంచే ప్రారంభం కావాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు



ర్యాలీలో పాల్గొన్న నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: మహిళాసాధికారత, వారి రక్షణకు కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషిచేస్తోందని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. వాజీ ఛానల్, మహిళా గర్జన కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నగరంలో జరిగిన మహిళా గర్జనలో ఆమె పాల్గొన్నారు. ఛానల్ డైరెక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మహిళలకు గౌరవం పెరగాలని, అది ఇళ్ల నుంచే ఆరంభం కావాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కలెక్టర్ అంబేడ్కర్ పేర్కొన్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ లైంగిక దాడులను తీవ్రమైన సమస్యగా గుర్తించి, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. కఠిన చట్టాలు అమలు చేయాలన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాపుగంటి ప్రకాష్, ఛైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్‌పర్సన్ జి.హిమబిందు, సూర్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ప్రగతికి లోక్‌సత్తా ప్రణాళిక



జయప్రకాశ్ నారాయణతో భీశెట్టి

విజయనగరం, ఈనాడు: రాష్ట్ర ప్రగతికి లోక్‌సత్తా ప్రణాళికలు సిద్ధం చేసిందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ తెలిపారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ సమావేశం కానున్నారన్నారు. త్వరితగతిన అభివృద్ధి చెందేలా రూపొందించిన రూట్‌మ్యాప్‌ను వారికి అందజేస్తారని చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లో జేపీను కలిశానని ఓ ప్రకటనలో వెల్లడించారు. విద్య, ఆరోగ్యం, ఉపాధి, వ్యవసాయం తదితర అంశాలపై జేపీ లోతుగా అధ్యయనం చేశారని, ప్రభుత్వం ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కాలంటే ఆర్థిక క్రమశిక్షణ అవసరమని గుర్తించారన్నారు. పాలనలో సమూల మార్పులు అత్యవసరమని, ఉచితాలకు దూరంగా ఉంటూ ఉపాధి కల్పనకు తగు చర్యలు తీసుకోవాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు చెప్పారు.

అంగరంగ వైభవం.. రామయ్య కల్యాణం



స్వామివారి పూజల్లో పాల్గొన్న అర్చకులు

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం దేవస్థానంలో పవిత్రోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం బాల భోగం, తీర్థగోష్ఠి చేపట్టారు. ఆస్థాన మండపంలో రుత్వికుల ఆధ్వర్యంలో పారాయణం, జపములు, హవనాలు జరిగాయి. అనంతరం పవిత్ర విసర్జన, పూర్ణాహుతి క్రతువులు భక్తిశ్రద్ధలతో సాగాయి. ఈ సందర్భంగా శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించారు. ఎమ్మెల్యే లోకం నాగమాధవి స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఈవో వై.శ్రీనివాసరావు, అర్చకస్వాములు పాల్గొన్నారు.

నెల్లిమర్లలో వైకాపాకు షాక్!

★ జనసేనలో చేరిన డెంకాడ ఎంపీపీ
★ ఆయన వెంటే ఉప ఎంపీపీ, ఎంపీటీసీలు



ఎమ్మెల్యేతో వాసుదేవరావు, బొడ్డవలస నాయకులు

డెంకాడ, న్యూస్‌టుడే: నెల్లిమర్ల నియోజకవర్గంలో వైకాపాకు భారీ షాక్ తగిలింది. వైకాపా డెంకాడ నాయకుడు, ఎంపీపీ బంటుపల్లి వెంకట సత్య వాసుదేవరావు ఆ పార్టీని వీడి సోమవారం జనసేనలో చేరారు. ఆయన సతీమణి, మోపాడ ఎంపీటీసీ సభ్యురాలు ఉషాకుమారి, ఉప ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు కూరాకుల అనిత, రాంపిల్లి మహేశ్వరి, గుడివాడ కిరణ్‌కుమార్, బొడ్డవలస, డి.కొల్లాం నాయకులు సైతం ఎమ్మెల్యే లోకం మాధవి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈనెల 3 లేదా 5వ తేదీన మిగిలిన ప్రజాప్రతినిధులు, అనుచరులు, నాయకులతో చేరేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, అదేరోజు 5 వేల మందితో భారీ బహిరంగ సభ ఉంటుందని నాయకులు తెలిపారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రస్‌డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	115	200	210

3 వేల టన్నుల పశు మాంసం స్వాధీనం

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలోని కేఎల్‌పురం సమీపంలో అక్రమంగా నిర్వహిస్తున్న పశు కబేళాపై టాస్క్‌ఫోర్స్ అధికారుల సహకారంతో ఒకటో పట్టణ పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. 30 ఆవులను, తరలించడానికి సిద్ధంగా ఉంచిన 3 వేల టన్నుల మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. 8 మందిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

ఈపీడీసీఎల్ ఏవోగా లక్ష్మీనారాయణ

విజయనగరం పట్టణం: ఏపీఈపీడీసీఎల్ ఉమ్మడి జిల్లా పరిపాలనాధికారిగా నాలుగేళ్లపాటు పనిచేసిన జి.శ్రీనివాసం కొత్తగా ఏర్పడిన మన్యం సర్కిల్ పరిపాలనాధికారిగా నియమితులయ్యారు. ఈయన స్థానంలో విశాఖలోని కార్పొరేట్ కార్యాలయం నుంచి కేవీ.లక్ష్మీనారాయణ రానున్నారు. బదిలీపై వెళుతున్న శ్రీనివాసంను ఎస్ఈ లక్ష్మణరావు సన్మానించారు.

భర్త మోసగించాడని మహిళ ఆందోళన



పోతనాపల్లిలో సుధాకర్ ఇంటి ముందు బైఠాయించిన హైదరాబాద్‌కు చెందిన మహిళ (కార్డు పట్టుకున్న ఆమె), కుటుంబ సభ్యులు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: తన భర్త మరో మహిళను పెళ్లి చేసుకుని అన్యాయం చేశాడని ఆరోపిస్తూ.. ఓ వివాహిత కుటుంబ సభ్యులతో కలిసి అతని ఇంటి ముందు బైఠాయించిన ఘటన శృంగవరపుకోట మండలం పోతనాపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన పరమేశ్వరి, కుటుంబ సభ్యులతో కలిసి తన భర్త పి.సుధాకర్ ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ సుధాకర్ హైదరాబాద్‌లో హోం గార్డుగా పని చేయగా, తాను పక్కనే ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రిలోని సెక్యూరిటీలో పనిచేశానన్నారు. ఇద్దరం ప్రేమించుకుని 2014లో పెద్దల సమక్షంలో యాదగిరి గుట్ట ఆలయంలో పెళ్లి చేసుకున్నామని చెప్పారు. తమకు అయిదేళ్ల పాప కూడా ఉందన్నారు. ఏడాది కిందట తండ్రి చనిపోయాడని అబద్ధం చెప్పి స్వగ్రామానికి వచ్చి విశాఖకు చెందిన వేరే మహిళను వివాహం చేసుకున్నాడని ఆరోపించారు. హైదరాబాద్‌లోనే కాపురం పెట్టాడని చెప్పారు. నాలుగు నెలల కిందట ఫోన్ చేస్తే సదరు మహిళ మాట్లాడడంతో అసలు విషయం బయటపడిందన్నారు. జూన్ 12న ముషీరాబాద్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అతన్ని ఉద్యోగం నుంచి తీసేశారని చెప్పారు. అనంతరం ఇక్కడకు వచ్చేశారని, చేసేది లేక న్యాయం కోసం వచ్చామన్నారు. సుధాకర్ కుటుంబ సభ్యులెవరూ ఇంట్లో లేరన్నారు. దీనిపై ఎస్.కోట సీఐ నారాయణమూర్తిని వివరణ కోరగా.. ముషీరాబాద్ స్టేషన్‌లో కేసు నమోదైందని, తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

ప్రాణం తీసిన విద్యుత్తు తీగలు

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: తెగిపడి ఉన్న విద్యుత్తు తీగలు తగిలి మహిళా రైతు మృతిచెందిన ఘటన పాలకొండ మండలం గొట్టమంగళాపురంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎల్.పార్వతమ్మ(58), సింహాచలం దంపతులు కూరగాయలు సాగు చేస్తూ.. జీవనం సాగిస్తున్నారు. సోమవారం ఉదయం పార్వతమ్మ పొలానికి వెళ్లారు. దారిలో అప్పటికే తెగిపడి ఉన్న విద్యుత్తు తీగను గమనించకుండా అడుగు వేశారు. ఈక్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రయోగమూర్తి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



శంకరరావు (పాతచిత్రం)

రేగిడి, న్యూస్‌టుడే: పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందారు. పోలీసుల వివరాల మేరకు.. పెదశిర్లాం గ్రామానికి చెందిన సీహెచ్.శంకరరావు(50) గతనెల 27న గ్రామం బయట పురుగు మందు తాగాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో ముందుగా రాజాం.. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచాడు. శంకరరావు టింబర్ డిపోలో, ఇంట్లో కర్రలతో గృహోపకరణాలు తయారు చేసేవాడు. అతనికి భార్య రుక్మిణి, కుమార్తె కరిష్మా ఉన్నారు. ఆసుపత్రి వర్గాల సమాచారం మేరకు కేసు నమోదు చేయనున్నట్లు ఏఎస్సై రాజారావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆపరేటరు మృత్యువాత



శ్యామ్‌కుమార్ (పాతచిత్రం)

గుర్ల, నెల్లిమర్ల, న్యూస్‌టుడే: కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన గుర్ల మండలం పరిధి నెల్లిమర్ల రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నెల్లిమర్లలోని తెలగ వీధికి చెందిన ఎస్.శ్యామ్‌కుమార్(40) మిమ్స్‌లో కంప్యూటర్ ఆపరేటరుగా పనిచేస్తున్నారు. ఆదివారం సాయంత్రం రాజాంలో అత్తవారింటికి పండగకు వెళ్లారు. సోమవారం భార్యను అక్కడే విడిచిపెట్టి విధులకు హాజరవడానికి ద్విచక్రవాహనంపై వస్తుండగా.. గుర్ల మండలం పరిధి నెలిమర్ల రైల్వే స్టేషన్ వద్ద కారు ఢీకొట్టింది. తలకు తీవ్రగాయాలు కావడంతో ఘటనాస్థలిలోనే మృత్యువాత పడ్డారు. అతని భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నారాయణరావు చెప్పారు.

ట్రాక్టరు పైనుంచి పడి వలస కూలీ దుర్మరణం

చౌటుప్పల్‌గ్రామీణం: పురపాలిక పరిధిలోని లింగారెడ్డిగూడెం శివారులోని పిలాయిపల్లి కాల్వ కల్వర్టు వద్ద జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు సీఐ మన్మథకుమార్ సోమవారం తెలిపారు. బలిజిపేట మండలం గంగాడకు చెందిన జి.గణేశ్(40) భార్యతో కలిసి అయిదు నెలల నుంచి మందోల్లగూడెంలోని చింతపల్లి నర్సింహారెడ్డి కోళ్ల ఫారంలో పని చేస్తున్నాడు. ఆదివారం చౌటుప్పల్‌లో సంత కావడంతో సరకులను కొనేందుకు తోటి కూలీలతో కలిసి ట్రాక్టర్‌లో వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో చోదకుడి పక్కనే కూర్చున్న ఆయన అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో చక్రాలు అతనిపైకి ఎక్కడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. అతని భార్య గౌరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ చెప్పారు.

గంజాయి స్వాధీనం.. జామి: జామి మండలం అలమండ రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం రాత్రి విజయనగరానికి చెందిన ముగ్గురు వ్యక్తులు గంజాయి అమ్ముతుండగా అదుపులోకి తీసుకున్నామని ఎస్సై వీరజనార్దన్ తెలిపారు. రెండు కిలోల సరకు స్వాధీనం చేసుకున్నామని, నిందితులను కోర్టుకు తరలించామన్నారు. కేసును ఎస్.కోట రూరల్ సీఐ రవికుమార్ దర్యాప్తు చేస్తున్నారన్నారు.

మద్యానికి బానిసై.. బలవన్మరణం

మంగళగిరి, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా తాడేపల్లి పరిధిలోని మహానాడులో నివాసం ఉంటున్న ఇంటూరి నారాయణ (58) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. విజయనగరం జిల్లా భోగాపురం మండలం సుందరపేటకు చెందిన నారాయణ, సత్యవతి దంపతులు కొన్నేళ్లుగా ఇక్కడ ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. గత నెలలో సత్యవతి కంటి వైద్యం కోసం స్వగ్రామానికి వెళ్లారు. ఈలోగా వరదలు రావడంతో ఇంట్లోని సామగ్రి వరదలో కొట్టుకుపోయాయి. దీంతో నిలువనీడలేని ఆయనకు స్థానికంగా ఉన్న ఓ రాజకీయ పార్టీకి చెందిన నాయకులు పార్టీ కార్యాలయంలో ఆశ్రయం కల్పించారు. ఎప్పటి నుంచో మద్యానికి బానిసైన ఆయన ఈనెల 29వ తేదీ అక్కడే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు.

మానవత్వం చాటిన 'కిద్మత్ టీమ్'

భార్య సోమవారం తాడేపల్లి పోలీసుస్టేషన్‌కి చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. భర్త మృతదేహాన్ని విజయనగరం జిల్లాకి తీసుకువెళ్లి అంత్యక్రియలు నిర్వహించే స్థోమత తనకు లేదని పోలీసులకు వివరించారు. ఈక్రమంలో పోలీసుల సహకారంతో మంగళగిరికి చెందిన 'కిద్మత్ టీమ్' సభ్యులు మృతదేహాన్ని మోసుకెళ్లి పట్టణంలోని శ్మశాన వాటికలో దహన సంస్కారాలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు.

చోదకుడికి అస్వస్థత స్తంభాన్ని ఢీకొన్న పాఠశాల బస్సు



నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: విద్యార్థులను తీసుకొని బస్సులో వెళ్తున్న ఓ చోదకుడు ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఈ క్రమంలో అదుపు తప్పిన వాహనం సమీపంలో ఉన్న స్తంభాన్ని ఢీకొని నిలిచిపోయింది. ఈ ఘటన సోమవారం సాయంత్రం నగరంలోని సీఎంఆర్ కూడలి వద్ద చోటు చేసుకుంది. స్థానికంగా ఉన్న ఓ విద్యా సంస్థకు చెందిన వాహనం చిన్నారులను ఇళ్లకు చేర్చే క్రమంలో 60 ఏళ్ల చోదకుడికి మూర్ఛ వచ్చిందని, అయితే చాకచక్యంగా వ్యవహరించడంతో ఎవరికీ ప్రమాదం జరగలేదని ఒకటో పట్టణ సీఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు.

బొబ్బిలి

•బొబ్బిలి •రాజాం •గజపతినగరం •చీపురుపల్లి

బాధితులకు అండగా సీఎం సహాయనిధి

రాజాం, గ్రామీణం, న్యూస్‌టుడే: ఆపదలో ఉన్నవారికి అండగా సీఎం సహాయనిధి నిలుస్తోందని ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్ అన్నారు. కొండంపేటకు చెందిన ఎస్.అర్జునరావు కుటుంబానికి రూ.1.38 లక్షలు, రేగిడి మండలం బూరాడ గ్రామానికి చెందిన వి.రామారావు కుటుంబానికి రూ.50 వేలు సీఎం సహాయనిధి నుంచి మంజూరు కావడంతో చెక్కులను సోమవారం అందజేశారు. వి.వెంకటరావు, ఎం.జయరాం, ఎం.జగన్మోహనరావు, ఆర్.గణపతి, దూబ ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్

పంటలు ఎండిపోతున్నాయ్

గరివిడి, న్యూస్‌టుడే: బాగువలసలో విద్యుత్తు నియంత్రిక కాలిపోయి రెండు వారాలు కావస్తోందని, ఇంత వరకు కొత్త నియంత్రిక ఏర్పాటు చేయలేదని రైతులు ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు దృష్టికి తెచ్చారు. పరిధిలోని 60 ఎకరాల్లో వరి పైరు ఎండిపోతోందని చెప్పారు. చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రెండు రోజుల్లో కొత్త నియంత్రిక ఏర్పాటు చేస్తామని ఏపీఈపీడీసీఎల్ ఏడీఈ రమణ చెప్పారు.

? మెంటాడలో రెండు రోజులుగా కుళాయిల నుంచి తాగునీరు రావడం లేదు. స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. - స్వామినాయుడు, దిగువవీధి

● పంపు హౌస్‌కు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. మంగళవారం నుంచి నీరు అందజేస్తాం. - రామ్‌నాథ్, కార్యదర్శి - న్యూస్‌టుడే, మెంటాడ

? గొడియాడ ఎస్సీ కాలనీలో చెత్తాచెదారాలను రహదారులపై వేస్తున్నారు. దుర్గంధంతో అవస్థలు పడుతున్నాం. - స్థానికులు

● చెత్తాచెదారాలు వేయకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. - భానోజీరావు, ఈవోపీఆర్డీ - న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

? తెర్లాంలో వర్షాలు పడినప్పుడు కాలువలోని మురుగునీరు రహదారిపై ప్రవహిస్తుంది. ఆ సమయంలో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. చిన్న వంతెన నిర్మించాలి. - స్థానికులు

● పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - శ్రీనివాసరావు, డీఈఈ ఆర్‌.డబ్ల్యూ.శాఖ - న్యూస్‌టుడే, గుర్ల

? కోటశిర్లాం గ్రామంలో రహదారికి ఇరువైపులా కాలువలు లేకపోవడంతో భారీ వర్షాలు కురిస్తే వీధుల్లో నీరు నిల్వ ఉంటోంది. - స్థానికులు

● కాలువల నిర్మాణానికి నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపిస్తాం. - రమేష్, ఏఈ - న్యూస్‌టుడే, రామభద్రపురం

అధ్యక్షుడిగా రమేష్‌కుమార్

రాజాం, న్యూస్‌టుడే: తూర్పుకాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శులుగా శాఖపు రమేష్‌కుమార్, వంజరాపు రాములు ఎన్నికయ్యారు. సంఘం సభ్యులు ఏకగ్రీవంగా తమను ఎన్నుకున్న నియామక పత్రం అందించినట్లు రమేష్‌కుమార్ సోమవారం తెలిపారు. రెండేళ్లు అధ్యక్షుడిగా సేవలు అందిస్తానన్నారు, సంస్థ్యకు చెంది మరోసారి అవకాశం కల్పించారన్నారు.

'తీరు మారకపోతే లెక్క తేల్చుతాం'

వాడీవేడిగా పుర కౌన్సిల్ సమావేశం


పురపాలక ఉపాధ్యక్షుడు మురళీకృష్ణ, కౌన్సిలర్ల మధ్య వాదులాట

బొబ్బిలి, న్యూస్‌టుడే: పురపాలక కౌన్సిల్ సమావేశం సోమవారం వాడీవేడిగా జరిగింది. పుర అధ్యక్షుడు సావు వెంకట మురళీకృష్ణారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్ల మధ్య మాటల యుద్ధం చోటుచేసుకుంది. ప్రతిపక్ష కౌన్సిలర్లు కూడా ఒకరిపై ఒకరు ఆరోపణలు, విమర్శలు చేసుకున్నారు. అనధికార లేఅవుట్లలో రహదారులు, కాలువలు ఎందుకు వేస్తున్నారని ఉపాధ్యక్షుడు సి.మురళీకృష్ణ అధికారులను నిలదీశారు. దీనిపై అదే పార్టీకి చెందిన కౌన్సిలర్లు ఇంటి గోవిందరావు స్పందిస్తూ.. అనధికార కట్టడాలు చాలా ఉన్నాయని, వాటిని గుర్తించక పోతే నిరాహారదీక్ష చేస్తానన్నారు. తెదేపా కౌన్సిలర్లు రాంబార్కి శరత్ మాట్లాడుతూ.. పురపాలికలో అవినీతి రాజ్యమేలుతోందని, కొంతమంది కౌన్సిలర్లు పట్టణ ప్రణాళికా విభాగంలో జోక్యం చేసుకుని బయట రూ.లక్షలు వసూలు చేస్తున్నారని, కొంత పట్టణ అధికారులకు ఇస్తున్నారని ఆరోపించారు. ఇటీవల తమ పార్టీ నాయకుడికి సంబంధించిన ఓ భవన నిర్మాణ విషయంలో రూ.లక్షలు డిమాండు చేసి కొంతమంది కౌన్సిలర్లు తీసుకున్నారని, ఇలా ప్రతి భవనం వద్దకు వెళ్లి వసూలు చేస్తున్నారని ఆరోపించారు. వీటన్నింటినీ సరిచేయకపోతే గతంలోని లెక్కలు అన్నీ తేల్చుతామని పేర్కొన్నారు. ప్రణాళిక చేయాలని కమిషనర్‌ను కోరారు. పట్టణంలోని పలు చోట్ల వీధి దీపాలు వెలగడంలేదని, పారిశుద్ధ్యం నిర్వహణ అధ్వానంగా ఉందన్నారు. అజెండాలోని అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. పలు విభాగాధిపతులు పాల్గొన్నారు.

పోస్టులు ఖాళీ.. అవస్థలే మరి

ఇంజినీరింగ్ అధికారుల కొరతతో అరకొర సేవలు

బొబ్బిలి నియోజకవర్గంలోని అనేక శాఖల్లో ఇంజినీరింగ్ అధికారుల పోస్టులు ఖాళీగా ఉండిపోయాయి. చాలా చోట్ల ఇన్‌ఛార్జులే ఉండటంతో ప్రజలకు సేవలు పూర్తిస్థాయిలో అందడం లేదు. ప్రభుత్వ పథకాల అమలు, పురోగతి పరిశీలన, పర్యవేక్షణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారం కష్టంగా మారింది. దీనిపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం


కారాడలో ఇళ్లపైనే విద్యుత్తు తీగలు

సభ్యుల అసహనం

ఇటీవల మండల పరిషత్తు సమావేశంలోనూ సమస్యలపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బొబ్బిలి మండలం చిత్రకోట బడ్డవలసలో స్తంభాలు శిథిలావస్థకు చేరాయని, కొత్త పెంట పొలాల్లో తీగలు వేలాడుతున్నాయని, కారాడ, వెల్గవలస, కలవరాయి, జే.రంగరాయపురం గ్రామాల్లో ఇళ్లపై తీగలు ఉన్నాయని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని వాపోయారు. శివడవలసలో లైన్‌మెన్ పోస్టు భర్తీ చేయాలని ఏఈకి చెబితే పట్టించుకోలేదని అసహనం వ్యక్తం చేశారు.

గృహ నిర్మాణశాఖలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు ఒక్కరే ఏఈ ఉన్నారు. మిగిలిన మూడు మండలాలు ఇన్‌ఛార్జులతోనే కొనసాగుతున్నాయి. వచ్చే ఏడాది మార్చి నాటికి గత ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లన్నీ పూర్తి చేయాలని లక్ష్యం విధించారు. దీన్ని పర్యవేక్షించాల్సిన ఇంజినీరింగ్ అధికారులే కరవయ్యారు. నాలుగు మండలాలకు 10,864 ఇళ్లు మంజూరు చేయగా ఇంతవరకు 7,269 మాత్రమే పూర్తి చేసినట్లు సంబంధిత అధికారుల లెక్కలు చెబుతున్నాయి. మిగిలిపోయిన 3,595 ఇళ్లు పూర్తి చేయించాల్సి ఉంది. బొబ్బిలి పట్టణ ఏఈగా పనిచేస్తున్న సూర్యనారాయణకు మండల బాధ్యతలు అప్పగించారు. రాజాం ఏఈ వేణుగోపాల్‌కు తెర్లాం మండల అదనపు బాధ్యతలు అప్పగించారు.. రామభద్రపురం మండలానికి డీఈ అప్పయ్య ఇన్‌ఛార్జిగా ఉన్నారు. బాడంగి మండల బాధ్యతలు అక్కడే పనిచేస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్‌కు (ఇన్‌ఛార్జి) అప్పగించారు.

సమస్యల తిష్ఠ

అత్యవసర విభాగాల్లో ఒకటైన విద్యుత్తు శాఖలో కూడా ఇంజినీరింగ్ పోస్టులు ఎక్కువగా ఖాళీగా ఉన్నాయి. బొబ్బిలి మండలంలో ఏఈ పోస్టు చాలా కాలంగా ఖాళీగా ఉంది. ఇటీవల జరిగిన బదిలీల్లో పట్టణ ఏఈ సాంబశివరావును మండలానికి బదిలీ చేసి.. పట్టణ బాధ్యతలు కూడా ఆయనకే అప్పగించారు. తెర్లాం, బాడంగి మండలాలకు ఏఈ పోస్టులు ఖాళీగా ఉండిపోవడంతో జేఈలను ఇన్‌ఛార్జులుగా నియమించారు. గజపతినగరంలో ఏఈ పోస్టు ఖాళీగా ఉండిపోవడంతో దత్తిరాజేరు మండల ఏఈకి అదనపు బాధ్యతలు అప్పగించారు. మెంటాడ ఏఈ బొండపల్లి మండలానికి ఇన్‌ఛార్జిగా సేవలు ఉన్నారు.

ఈ శాఖలోనూ...

పంచాయతీరాజ్ శాఖలోనూ ఇంజినీరింగ్ అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాజాం, గజపతినగరం, బొబ్బిలి నియోజకవర్గాలకు ప్రధాన కేంద్రమైన బొబ్బిలి ఈఈ పోస్టులో ప్రస్తుతం ఎవరూ లేరు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఈఈ శ్రీనివాసరావు ప్రకాశం జిల్లా మార్కాపురం వెళ్లిపోయారు. ఇక్కడ ఎవరినీ నియమించలేదు. ప్రస్తుతం ఏసీబీ చూస్తున్నారని డీఈ అప్పారావు తెలిపారు. రామభద్రపురం మండలంలో ఏఈ పోస్టు ఖాళీగా ఉండటంతో బాడంగి ఏఈ రమేష్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

పల్లెల ప్రగతికి ప్రభుత్వం బాటలు


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

గరివిడి, చీపురుపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఇస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, బాలికలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. సోమవారం మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవం కార్యక్రమంలో మాట్లాడారు. బావి తరాల భవిష్యత్తు వికసిత్ లో పని చేస్తున్న సీఎం చంద్రబాబు జాతీయ సంపదని కొనియాడారు. వైకాపా ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని కుంటుపరిచిందని, కూటమి ప్రభుత్వం పల్లెల ప్రగతికి బాటలు వేస్తోందన్నారు. తెదేపా నేతలు కె.త్రిమూర్తులురాజు, ఎస్.సురేష్‌బాబు, బి.వెంకటరావు, ఆర్.కామునాయుడు తదితరులు పాల్గొన్నారు. ● తిరుమల లడ్డూ కల్తీ నేపథ్యంలో చీపురుపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రాయశ్చిత్త పూజలు నిర్వహించారు.

మేలుకోకపోతే ముప్పే

నేటి చిత్రం

వేగావతి నది ఒడ్డున నిర్మించిన తాగునీటి ఊట బావి కోతకు గురవుతోంది. ఇక్కడి నుంచి రామభద్రపురం మండల కేంద్రానికి తాగునీరు అందిస్తున్నారు. నదిలోని ఊటబావి ద్వారా పైపులైన్లు వేసి పంపింగ్ చేస్తున్నారు. తరచూ నదిలో నీటి ప్రవాహం ఎక్కువ కావడంతో కోతకు గురవుతోంది. రానున్న కాలంలో కొట్టుకుపోయే ప్రమాదముందని ఇంజినీరింగ్ అధికారులు అంటున్నారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, కోతకు గురికాకుండా చర్యలు తీసుకుంటామని డీఈ పీఎంకే రెడ్డి 'న్యూస్‌టుడే'కు తెలిపారు. - న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం



నిత్యం నరకం

సంతకవిటి మండలం గరికిపాడు - సోమన్న పేట గ్రామాల మధ్య రెండు కి.మీ. పొడవున రహదారి బురదమయంగా మారడంతో వాహనదారులు, పాదచారులు నానా అవస్థలు పడుతున్నారు. సోమన్నపేటకు శాశ్వత రహదారి కల్పించాలని ఎన్నాళ్లుగా కోరుతున్నా.. నేతలు, అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారికి బాగు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ఏఈ రియాజ్ మాట్లాడుతూ.. రోడ్డు మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. - న్యూస్‌టుడే, సంతకవిటి



రాష్ట్రస్థాయిలో సత్తా


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బొండపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు గొట్లాం ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానాచార్యుడు శ్రీరామాచారి సోమవారం తెలిపారు. అండర్-14 విభాగంలో జి.కార్తిక్, జి.మానిక్, ఎం.పావని, అండర్-17లో కె.కీర్తన, సి.రమాదేవి ప్రతిభ చూపారని చెప్పారు.

జిల్లాస్థాయి క్రీడాకారుల ఎంపిక


బేస్‌బాల్ పోటీలు

బాడంగి, న్యూస్‌టుడే: బాడంగి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో అండర్-14, 17, బాలుర, బాలికల జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ బేస్‌బాల్ క్రీడాకారుల ఎంపిక జరిగింది. ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, ఎంఈవో రాజేశ్వర్ పోటీలను ప్రారంభించారు. జిల్లాలో నలుమూలల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు నల్ల వెంకటనాయుడు, పీడీ బంగారునాయుడు, జిల్లా ఆర్గనైజ్ కార్యదర్శి గాంధీ, 30 మంది పీడీలు పాల్గొన్నారు.

కేజీబీవీ బాలికల ప్రతిభ


విద్యార్థినిని అభినందిస్తున్న ఎంఈవో రామారావు, ప్రిన్సిపల్ ధనలక్ష్మి

గరివిడి, న్యూస్‌టుడే: గరివిడి కేజీబీవీ బాలికలు క్రీడల్లో సత్తా చూపారు. ఇంటర్మీడియట్ విద్యార్థిని బి.సౌజన్య రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు జిల్లా తరఫున ఎంపికైంది. స్కూల్ గేమ్స్ ఫుట్‌బాల్ పోటీల్లో అండర్-14కు వి.పూజిత, అండర్-17కు ఆర్.మాలతి రాష్ట్రస్థాయిలో పాల్గొనే జిల్లా జట్టులో చోటు దక్కించుకున్నారు. పి.జ్ఞానేశ్వరి అండర్-17 స్కూల్ గేమ్స్‌లో సాఫ్ట్‌బాల్ జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైందని. ఎంఈవో పి.రామారావు, కేజీబీవీ ప్రిన్సిపల్ ధనలక్ష్మి అభినందించారు.

పోలీసుల ఆరా

బొబ్బిలి, న్యూస్‌టుడే: సాటి మహిళా ఉద్యోగినిపై ఉన్నత ఉద్యోగి అనుచిత ప్రవర్తనపై పోలీసులు ఆరా తీస్తున్నారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు లేకపోవడంతో గోప్యంగా దర్యాప్తు నిర్వహిస్తున్నారు. సోమవారం ఆ కార్యాలయానికి వెళ్లి సమాచారాన్ని సేకరించినట్లు తెలిసింది. ఇటీవల దీనిపై ఫిర్యాదు లేదని ఎస్సై రమేష్ తెలిపారు.

'తల్లిదండ్రుల్ని బెదిరిస్తున్నారు'

బొబ్బిలి, న్యూస్‌టుడే: పాతబొబ్బిలికి చెందిన పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు టీసీలు ఇస్తే వేరే పాఠశాలకు వెళ్తిపోతామని ప్రధానోపాధ్యాయులు సునేత్రిని కోరారు. వామపక్ష నేతలు శంకర్రావు, అప్పన్న చేరుకుని టీసీలు ఇవ్వాల్సిందిగా అడ్డుపడ్డారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల భూములను కొనుగోలు చేసిన వైకాపా నాయకుడు విద్యార్థుల తల్లిదండ్రులను బెదిరిస్తున్నారని ఆరోపించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


గద్దెకు వినతిపత్రం అందజేస్తున్న జిల్లా రేషన్ డీలర్ల సంఘం సభ్యులు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు సి.హెచ్.రామారావు, ఉపాధ్యక్షుడు ఆర్.రామారావు, ప్రధాన కార్యదర్శి కె.ఉమాశంకర్, కోశాధికారి ఎస్.ముత్యాలనాయుడు తదితరులు సోమవారం రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ సభ్యుడు గద్దె బాబూరావుకు వినతిపత్రం అందజేశారు. కార్పొరేషన్ సభ్యుడిగా నియమితులైన సందర్భంగా సత్కరించారు. సంఘ సభ్యులు రామలింగేశ్వరరావు, గోపికృష్ణ, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

'స్నేహం' సేవలు నిరుపమానం

రాజాం, న్యూస్‌టుడే: స్నేహం అసోసియేషన్ ద్వారా రెండు దశాబ్దాలుగా సేవలు అందిస్తున్న దడం ముదవహామని సంస్థ ప్రతినిధి బీబీ అచ్యుత్‌కుమార్, పొట్నూ వెంకటేష్ గుప్తాలు అన్నారు. అసోసియేషన్ కన్వీనర్ అంబీరా కోటేశ్వరరావు, స్నేహం సభ్యుడు కొత్త సాయిప్రశాంత్‌కుమార్‌లను సోమవారం రాజాంలో ఘనంగా సన్మానించారు. వీరు చేస్తున్న సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో కొత్త ప్రకాష్, యాదవ్, ప్రసాద్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.


సాయి ప్రశాంత్‌కుమార్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

ముగిసిన పోషకాహార మాసోత్సవాలు


గర్భిణులకు సీమంతం చేస్తున్న పీవో రాజ్యలక్ష్మి

తెర్లాం, న్యూస్‌టుడే: గర్భిణులు, బాలింతలు, తల్లులు పోషకాహారానికి ప్రాధాన్యత ఇవ్వాలని పీవో రాజ్యలక్ష్మి అన్నారు. పోషకాహార మాసోత్సవాల ముగింపు సందర్భంగా తెర్లాం మండలం నందబలగ అంగన్‌వాడీ కేంద్రంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వం మంజూరు చేసిన కొన్ని పరికరాలను సర్పంచితో కలిసి ప్రారంభించారు. ● బొబ్బిలి గ్రామీణం: మెట్టవలసలో పీవో ఆధ్వర్యంలో సాక్షం-2 ప్రోగ్రాంలో ప్రభుత్వం ఇచ్చిన శుద్ధజలం ప్లాంటును ప్రారంభించారు.

ఇంటింటికీ తపాలా సేవలు

గజపతినగరం, న్యూస్‌టుడే: సిబ్బంది సహకారంతో ప్రతి ఇంటికి తపాలా సేవలు చేరేలా చర్యలు తీసుకుంటానని గజపతినగరం డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న బొడ్డుల ఉపేంద్ర తెలిపారు. ఆయన సోమవారం ఎస్‌వో అపాయ్‌గా బాధ్యతలు తీసుకున్నారు. పలమనేరు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, లబ్ధిదారులకు చేరేందుకు చూస్తామన్నారు. కార్యాలయ సిబ్బంది అభినందించారు.


పుష్పగుచ్ఛం అందిస్తున్న సిబ్బంది

దేవస్థానం ఈవోగా శ్రీనివాస్

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లి కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ఈవోగా బి.శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఈవో జి.శ్రీనివాస్ బదిలీ కావడంతో విశాఖపట్నంలోని పెదవాల్తేరు వెంకటేశ్వరస్వామి ఆలయ ఈవోగా ఉన్న శ్రీనివాస్ బదిలీపై ఇక్కడకు వచ్చారు.

ఆసుపత్రి పర్యవేక్షకుడిగా సుధీర్

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లి ప్రాంతీయాసుపత్రి పర్యవేక్షకుడిగా డా.పి.సుధీర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన డా.నాయక్ స్థానంలో ఇదే ఆసుపత్రిలో సివిల్ సర్జన్‌గా పనిచేస్తున్న మత్తు వైద్యుడు సుధీర్ నియామకం అయ్యారు. సిబ్బంది అభినందించారు.

ఎక్సైజ్ సీఐగా చక్రవర్తి

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లి ఎక్సైజ్ సీఐగా సీహెచ్ చక్రవర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు పనిచేసిన కె.జనార్దనరావు గజపతినగరం సర్కిల్‌కు బదిలీపై వెళ్లారు.

ఉపాధ్యాయులు మార్గనిర్దేశకులు

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు సమాజ నిర్దేశకులని పలువురు వక్తలు కొనియాడారు. రావివలస హెచ్ఎం పి.రమేష్ ఉద్యోగ విరమణ సందర్భంగా ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు సత్కరించారు. సర్పంచి పి.మణికంఠ, ఎంఈవో ఎం.బాసినాయుడు, తోటి ఉపాధ్యాయులు, పెద్దలు పాల్గొన్నారు.



యువతకు అవగాహన

వంగర, న్యూస్‌టుడే: మత్తు పదార్థాలు జీవితాన్ని పాడుచేస్తాయని, యువత వాటికి దూరంగా ఉండాలని ఎస్సై షేక్‌శంకర్ అన్నారు. ఎం.సీతారాంపురం

సంక్షిప్త సమాచారం

కూడలిలో యువతకు అవగాహన కల్పించారు. అంతా చదువుపై దృష్టి పెట్టాలన్నారు.

ఎంఈవోకు వినతి

గజపతినగరం, న్యూస్‌టుడే: రామన్నపేట పాఠశాలలో ఆయాగా పనిచేస్తున్న వి.జానకిని కొనసాగించాలని మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షురాలు వి.లక్ష్మి వినతి పత్రాన్ని అందించారు. రాజకీయ వేధింపుల కారణంగా ప్రధానోపాధ్యాయుడు హాజరు వేయడం లేదని ఎంఈవో, డీఈవోలకు తెలియజేశామన్నారు.

చర్యలకు డిమాండు

రామభద్రపురం, న్యూస్‌టుడే: ఆరికతోట నుంచి దుప్పలపూడి, పాతరేగ, నర్సాపురం, కొత్తరేగ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన కొంత మంది అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని, వాటిని నిలిపివేయాలని తహసీల్దారు సులోచనారాణికి దుప్పలపూడి సర్పంచి వి.భాస్కరరావు ఆధ్వర్యంలో పలువురు వినతి పత్రం అందించారు.

విద్యార్థిని ప్రతిభ

వంగర, న్యూస్‌టుడే: వంగర జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని పి.లావణ్య జిల్లాస్థాయి వక్తృత్వ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించినట్లు ఎంఈవో దుర్గారావు తెలిపారు.


ఈ-శ్రమ్‌లో నమోదు కావాలి

రాజాం, న్యూస్‌టుడే: అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులంతా ఈ-శ్రమ్‌లో నమోదు కావాలని సహాయ కార్మికాధికారి కొండలరావు కోరారు. పట్టణంలోని పలువురు కార్మికులకు అవగాహన కల్పించారు.

వ్యక్తి అరెస్టు

గజపతినగరం, న్యూస్‌టుడే: స్థానిక చంపావతి నది వంతెన వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తున్న గజపతినగరానికి చెందిన అప్పలరాజు వద్ద 25 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసినట్లు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు.

డీఈ బాధ్యతల స్వీకరణ



బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: బొబ్బిలి సబ్ డివిజన్ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈగా డిల్లేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పాలకొండ నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న పీఎంకే రెడ్డి సాలూరు డివిజనుకు బదిలీ అయ్యారు. డివిజన్‌లో తాగునీటి సమస్య పరిష్కరించి దానికి ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానన్నారు.

బిక్కుబిక్కుమంటూ సేవలు


పైపెచ్చులూడుతున్న దత్తిరాజేరు మండల విద్యావనరుల కేంద్రం భవనం

దత్తిరాజేరు, /గజపతినగరం /బొండపల్లి/ గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: గజపతినగరం నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ శాఖల భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితిలో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ సేవలు అందిస్తున్నారు. కొత్త భవనాలు నిర్మించాలని, మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

● దత్తిరాజేరు మండలంలో విద్యా వనరుల కేంద్రం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. పై పెచ్చులూడి పడి కారిపోతోంది. ప్రమాదకరంగా ఉందని, ప్రత్యామ్నాయ భవనాన్ని చూపించాలని సిబ్బంది మండల అధికారులకు పలుమార్లు కోరారు. పెదమానాపురం, దత్తిరాజేరు పశువైద్య కేంద్రాలు, మరడాం, కె.కొత్తవలస ఉప కేంద్రాలు శిథిలావ


తలుపులు ఊడిపోయి ఇలా..

స్థకు చేరుకున్నాయి. తహసీల్దారు కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరం వర్షానికి కురుస్తోంది. గజపతినగరం ఎంఈవో కార్యాలయం, గంట్యాడ, బోనంగి, బుడతనాపల్లి, పెనసాం పశువైద్య కేంద్రాలు పాడయ్యాయి. బొండపల్లి మండలంలోని వెలుగు, ప్రీనిధి, నీటిపారుదల శాఖ కార్యాలయ భవనాలు మూలకు చేరాయి. మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తోపాటు జిల్లా అధికారుల దృష్టికి సమస్యలు తీసుకెళ్లి పరిష్కారించేలా చూస్తామని ఎంపీడీవో సుబ్రహ్మణ్యం 'న్యూస్‌టుడే'తో అన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలంటూ నిరసన

రామభద్రపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలంటూ సిబ్బంది రామభద్రపురంలో దుకాణాల ముందు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. కరోనా సమయంలోనూ విధులు నిర్వహించామన్నారు. ప్రభుత్వం ఆదుకోకపోతే తమ కుటుంబాలు రోడ్డున పడతాయని వాపోయారు.

విజయనగరం

• విజయనగరం • నెల్లిమర్ల • ఎస్.కోట

సమస్యలపై వినతుల వెల్లువ


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: విజయనగరంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 54 వినతులు స్వీకరించినట్లు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. భూతగాదాలకు సంబంధించి 18, కుటుంబ కలహాలు- 4, మోసాలు- 10, ఇతర వాటిపై 22 మంది అర్జీలు ఇచ్చారన్నారు. సీఐ ఎస్సైలు వాసుదేవ్, రాజేష్ పాల్గొన్నారు.

ఉడాకాలనీ, న్యూస్‌టుడే: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ఒప్పంద, పొరుగు సేవల సంఘం నాయకులు రామకృష్ణ, సాయికుమార్, మురళీ, చిరంజీవి కోరారు. సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ● సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఒప్పంద, పొరుగుసేవల కార్మికులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ డిమాండు చేశారు. కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ప్రభుత్వ రంగ సంస్థలైన ఆర్టీసీ, విద్యుత్తు, పురపాలక, కార్పొరేషన్లలో ఏళ్లుగా పనిచేస్తున్నా కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేదని, చట్టాలు అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.


కలెక్టరేట్ వద్ద నినాదాలు చేస్తున్న కార్మికులు

అర్బన్, ఉడాకాలనీ: మెంటాడ, వేపాడ, ఎస్.కోట, రామభద్రపురం మండలాల్లో ఆదివాసీలకు ఎలాంటి సదుపాయాలు లేవని వారంతా పేదరికంలో నివసిస్తున్నారని, విజయనగరం జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.అవినాష్‌కుమార్ డిమాండు చేశారు. కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు.


ధర్నా చేస్తున్న ఆదివాసీ నాయకులు, గిరిజనులు


ఇసుక అక్రమ రవాణా అడ్డుకోండి

ఎస్.కోట: వేములాపల్లి, మామిడిపల్లి, గోపాలపల్లి గ్రామాల సమీపాన గోస్తనీ ఏటి నుంచి నాటుబళ్లతో ఇసుక అక్రమ రవాణా అడ్డుకోవాలని గట్రాజుకల్లాలకు చెందిన చప్ప శ్రీను కలెక్టరు అంబేడ్కర్, ఎస్పీ, భూగర్భ గనులశాఖ ఏడీకి ఫిర్యాదు చేశారు. వెంటనే అరికట్టాలని కోరారు.

ఇంటింటి కుళాయిలకు కార్యాచరణ

కొత్తవలస, న్యూస్‌టుడే

నియోజకవర్గంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి కార్యాచరణ సిద్ధమైంది. జలజీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయిలు వేసి తాగునీరు అందించడానికి గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు ప్రతిపాదనలు తయారుచేశారు. జలజీవన్ పథకాన్ని 2020-21 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించారు.


సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

ఈ ఏడాది మార్చి నెలాఖరుకు ఇంటింటికీ కుళాయిలు వేసి తాగునీరు అందించాలన్న లక్ష్యాన్ని నిర్దేశించారు. వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అనుకున్న మేరకు పనులు జరగలేదు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం వచ్చాక ఇంటింటి కుళాయిలు పథకంపై ప్రత్యేక దృష్టి సారించారు. 2027 నాటికి ఇంటింటికీ కుళాయి నీరు సరఫరాను లక్ష్యంగా పెట్టుకున్నారు. నియోజకవర్గంలో అయిదు మండలాల్లో ఈ పథకాన్ని అమలు చేయడానికి సుమారు రూ.230 కోట్లు అవసరం ఉంటుందని ప్రతిపాదించారు. ఇందులో రూ.92 కోట్లు వరకు ప్రాజెక్టు పనులకే ఖర్చవుతుందని అంచనా. ఇప్పటికే ప్రాజెక్టు పనుల నిర్వహణకు గుత్తేదారుని ఎంపికచేశారు. త్వరలో పనులు మొదలయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

49,624 గృహాలకు కనెక్షన్లు

ఎస్.కోట నియోజకవర్గంలోని అయిదు మండలాల్లో 49,624 గృహాలకు కుళాయిలు వేయాల్సి ఉందని ఇటీవల నిర్వహించిన పల్స్ సర్వేలో తేల్చారు. ఇందులో కొత్తవలస మండలంలోనే ఎక్కువ కుళాయిలు వేయాల్సి ఉంది. అయిదు మండలాల్లో 136 పంచాయతీలు 340 శివారు గ్రామాల్లో సర్వే పూర్తిచేశారు. 2011 జనాభా లెక్కలకు సంబంధించి ఐఎంఐఎస్ సర్వే ప్రకారం 84,559 గృహాలున్నాయి. ఇటీవల పూర్తిచేసిన పల్స్ సర్వేలో మాత్రం 91,703 గృహాలున్నట్లు లెక్క తేలింది. ఇందులో రెండుసార్లు పేర్లు వచ్చినవి 1,006, తాజా సర్వేలో లబ్ధిదారులు లేని ఇళ్లు 10,641గా తేలాయి. ఇవి మినహా మొత్తం మీద 80,056 గృహాలకు కుళాయిలు వేయాల్సి ఉందని లెక్క తేల్చారు.

ఇదీ పరిస్థితి..

మండలం	కుళాయిలున్నవి	లేనివి
కొత్తవలస	2,318	13,692
ఎల్.కోట	4,790	8,744
వేపాడ	4,338	8,269
ఎస్.కోట	12,402	10,190
జామి	6,584	8,729
మొత్తం	30,432	49,624

త్వరలో ప్రాజెక్టు పనులు

ప్రాజెక్టుకు సంబంధించి నియోజకవర్గానికి మంజూరైన రూ. 92 కోట్లతో పనులు త్వరలో మొదలు కానున్నాయి. దీనిద్వారా ఇంతవరకు శృంగవరపుకోట, వేపాడ, లక్కవరపుకోట మండలాల్లో కొంత ప్రాంతానికి నీటి సరఫరా చేశారు. లక్కవరపుకోట మండలం రంగరాయపురం దగ్గర ప్రాజెక్టు పైపులైను పనులు నిలిచిపోయాయి. దీన్ని కొత్తవలస మండలం వరకు కొనసాగించాల్సి వుంది. దీనిలో భాగంగా సంపులు, ఓహెచ్‌పీఆర్‌లు, పంపింగ్ మెయిన్లు నిర్మిస్తారు. గ్రామాల్లో ఉన్న చిన్న ఓవర్‌హెడ్ ట్యాంకులకు నీరు సరఫరా అయ్యేలా ఈ పనులు చేస్తారు. గ్రామీణ నీటి సరఫరా ఆధ్వర్యంలో జలజీవన్ మిషన్‌లో భాగంగా గ్రామాల్లో అంతర్గత పైపులైన్లు వేసి ఇంటింటికీ కుళాయిలు ఇస్తారు.

జలజీవన్ మిషన్‌లో చేపట్టనున్న పనులు

సిద్ధంగా ఉన్నాం.. ఇంటింటికీ కుళాయిలు వేయడానికి సిద్ధంగా ఉన్నాం. ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాం. నిధులు మంజూరు చేసి, టెండర్లు పిలిచి, గుత్తేదారుని ఎంపిక చేసిన వెంటనే పనులు మొదలుపెట్టి యుద్ధప్రాతిపదికన చేయించడానికి ఏర్పాట్లు చేశాం.
–కె.ఆర్.వి.పైడిరాజు, గ్రామీణ నీటి సరఫరాశాఖ డీఈ, లక్కవరపుకోట

మౌలిక సదుపాయాలు కల్పించండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగమాధవి

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: నెల్లిమర్ల, జరజాపుపేట ప్రాంతాల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆదేశించారు. ఛైర్‌పర్సన్ సరోజని అధ్యక్షతన సోమవారం నగర పంచాయతీలో జరిగిన సాధారణ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడారు. 1450 మంది లబ్ధిదారులకు పట్టాలిచ్చినా, స్థలాలు కేటాయించలేదని 7వ వార్డు కౌన్సిలర్ ప్రసాద్, మౌలిక సదుపాయాలపై కౌన్సిలర్ సత్యవతి ఆమె దృష్టికి తీసుకెళ్లారు. వైస్ ఛైర్మన్లు రామారావు, కృష్ణ, కమిషనరు కె.అప్పలరాజు పాల్గొన్నారు. ● రామతీర్థం కూడలి వద్ద ఏర్పాటు చేసిన మెప్మా బజార్‌ను అనంతరం ఆమె ప్రారంభించారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

విజయనగరం పట్టణం	80089 02900
విజయనగరం గ్రామీణం	80085 74317
ఎస్.కోట	80085 74326
భోగాపురం	80085 74319

? నటరాజ్ కాలనీ-1లో మురుగునీరు రోడ్డెక్కుతోంది. - స్థానికులు
● పరిశీలించి, చర్యలు తీసుకుంటాం.
- సాంబమూర్తి, ప్రజారోగ్య అధికారి
–న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

? గుడివాడలో సచివాలయం వెనుక చెత్తపేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది
- రాముడు నాయుడు, స్థానికుడు
● తక్షణమే సమస్యను పరిష్కరిస్తాను.
- అచ్యుతరావు, కార్యదర్శి, గుడివాడ
–న్యూస్‌టుడే, భోగాపురం

హమ్మయ్య.. పలకలు వేశారు



విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: నగరంలోని సింహాద్రినగర్ సూర్యా ఆసుపత్రి దారిలో కాలువపై ఎట్టకేలకు పలకలు వేశారు. ఇంతవరకు తెరిచి ఉండడంతో ప్రమాదాలు జరిగేవి. దీనిపై స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు ఫిర్యాదు చేశారు. సమస్యను ఈఈ కె.శ్రీనివాసరావు, ఏఈ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించి చర్యలు తీసుకున్నారు.

స్పందనకు వందనం

సమ్మెలోకి నగరపాలిక కార్మికులు


ఎంహెచ్‌వోకు నోటీసు ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: నగర పాలక సంస్థలో పనిచేస్తున్న ఒప్పంద, పొరుగు సేవలు, శాశ్వత పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేకుంటే ఈ నెల 10 తర్వాత ఎప్పుడైనా సమ్మెలోనికి వెళ్తామని ఏఐటీయూసీ నేతలు ఎస్.రంగరాజు, జె.కామేష్ హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ప్రజారోగ్య అధికారి కె.సాంబమూర్తికి సమ్మె నోటీసు ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ సౌకర్యాలు లేవని, ఆరోగ్య భృతి, ఇతర బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు.

రాక్‌గార్డెన్ అభివృద్ధికి చర్యలు

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: దక్షిణ భారత దేశంలో తొలి బొటానికల్ గార్డెన్‌గా పేరుగాంచిన రాణి అప్పలకొండయాంబ రాక్‌గార్డెన్‌ను రెండ్రోజుల్లో శుభ్రపరిచి, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని కమిషనరు పి.నల్లనయ్య ఆదేశించారు. సోమవారం పరిశీలించి సూచనలిచ్చారు. ● నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అయిదు వినతులు వచ్చాయన్నారు. ● పలు నీటి సరఫరా కేంద్రాలను కమిషనరు పి.నల్లనయ్య పరిశీలించారు. నెల్లిమర్ల, రామతీర్థం, కుదిపి ప్రాంతాల్లోని హెడ్ వాటర్ వర్క్సును తనిఖీ చేశారు.



నైపుణ్యాభివృద్ధికి కృషి చేయాలి


నమూనాలను పరిశీలిస్తున్న తిరుపతిరావు, అధ్యాపకులు

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: జిల్లా డైట్ కళాశాలలో చదువుతున్న ఛాత్రోపాధ్యాయులు నైపుణ్యాభివృద్ధికి కృషి చేయాలని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎన్.తిరుపతినాయుడు సూచించారు. సోమవారం డైట్ శిక్షణ కళాశాలలో 'పని-విద్య' అనే అంశంపై నిర్వహించిన మేళాలో విద్యార్థులు తయారు చేసిన వస్తువులను ప్రదర్శించారు. అనంతరం ఛాత్రోపాధ్యాయులు రూపొందించిన వస్తువులు, బొమ్మలు, సామగ్రి పరిశీలించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కె.రామకృష్ణారావు, పి.రవికుమార్, వి.భారతి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలను ధార్మిక సంస్థలకు అప్పగించాలి

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: దేవాలయాల నిర్వహణను హిందూ ధార్మిక సంస్థలకు అప్పగించాలని విశ్వ హిందూ పరిషత్ ఉత్తరాంధ్ర విభాగ కార్యదర్శి కాళ్ల నాగభూషణరావు, ధర్మ ప్రచార విభాగం ప్రాంతీయ ఇన్‌ఛార్జి సూర్యనారాయణ కోరారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ప్రకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. తిరుపతి లడ్డూ అపవిత్రతపై దర్యాప్తు వేగవంతం చేయాలని, సిటింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు. జిల్లా కార్యదర్శి అప్పారావు, చలమయ్య, నాగరాజు శర్మ, నాగేశ్వరరావు, సన్యాసిరావు, రామకృష్ణ పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న పరిషత్ ప్రతినిధులు

ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శన


యోగాసనాల్లో విద్యార్థులు

జామి, న్యూస్‌టుడే: విజినిగిరి యోగాశ్రమంలో యోగాచార్య రాపర్తి రామారావు జయంత్యుత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత నివాళులర్పించారు. అనంతరం యోగచైతన్య రామం ట్రస్టు అధ్యక్షుడు నరసింహారావు అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. రెండు రాష్ట్రాల నుంచి ఆధ్యాత్మిక ప్రముఖులు హాజరయ్యారు. విశ్రాంత తెలుగు అధ్యాపకుడు రఘునాథశర్మ ఫలితం ఆశించకుండా కర్తవ్యం నిర్వహించాలన్నారు. ఆదాయపన్ను ముఖ్యకమిషనర్ శిరికుమార్ మాట్లాడారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది.

ఈ దారుల్లో వెళ్లేదెలా..!

భోగాపురం, న్యూస్‌టుడే: విశాఖ నుంచి శ్రీకాకుళం వైపు వెళ్లే జాతీయరహదారిలో జిల్లాలోని భోగాపురం, పూసపాటిరేగ మండలాలు కీలకం. నిత్యం వేలాది వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఆరువరసల ఈ రహదారిలో ఈ రెండు మండలాల పరిధిలో పలుచోట్ల రోడ్లు గుంతలతో ఉండడం, మరికొన్నిచోట్ల చెత్త డంపింగ్‌తో అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. దీనికితోడు చిన్నపాటి చినుకుపడితే చిత్తడిగా మారుతోంది. ఈ దారిలో ప్రయాణాలు చేసేవారు ఇబ్బందులు పడుతున్నారు. ● భోగాపురం నుంచి సవరవిల్లి ప్రధాన రహదారిపై నీరు నిలిచిపోతోంది. ● అక్కివరం వద్ద వంతెన దిగువన వర్షపు నీరు వెళ్లేందుకు మార్గం లేక ఆ నీటి నుంచే రాకపోకలు చేయాల్సిన పరిస్థితి. ● పూసపాటిరేగ మండలం ప్రధాన కూడలి వద్ద రహదారులపై ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు చేరుతుండడంతో వాహన చోదకులు అందులో దిగి ప్రమాదాలకు గురవుతున్నారు. దానికి సమీపంలోనే చెత్తనిల్వలు చూస్తే జాతీయ రహదారి అధికారుల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై సంబంధిత జాతీయ రహదారి భద్రతా అధికారులు చర్యలు తీసుకుని పరిస్థితిని చక్కదిద్దాలని స్థానికులు కోరుతున్నారు. ఈ పరిస్థితిపై సీఐ ప్రభాకరరావు వద్ద ప్రస్తావించగా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు.


వర్షం పడితే అక్కివరం వంతెన దిగువ ఇదీ పరిస్థితి


పూసపాటిరేగ ప్రధాన కూడలి వద్ద రహదారి దుస్థితి

మర్యాద పూర్వక కలయిక


సీఎంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న వనజాక్షి, రవిశేఖర్, ఆనంద్‌కుమార్

విజయనగరం అర్బన్, నెల్లిమర్ల, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును తెదేపా జిల్లా మహిళా అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షి, రవిశేఖర్ దంపతులు, మండల తెదేపా అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్ రాజధాని అమరావతిలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆనంద్‌కుమార్ నియోజకవర్గంలో సమస్యలు వివరించారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని చెప్పినట్లు ఆనంద్‌కుమార్ విలేకరులకు తెలిపారు. జిల్లా అధికార ప్రతినిధి రాజారావు పాల్గొన్నారన్నారు.

పైడితల్లి సేవలో ఆర్జేసీ



ద్వారకా తిరుమల దేవస్థానం ప్రాంతీయ సంయుక్త కమిషనర్ ఎన్.వి.ఎస్.ఎన్. మూర్తి తన సతీమణితో కలిసి సోమవారం విజయనగరం పైడితల్లిని దర్శించారు. దేవస్థానం ఈవో ప్రసాదరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి పూజల అనంతరం ప్రసాదాలు అందజేశారు.
– న్యూస్‌టుడే, కంటోన్మెంట్

సంక్షిప్త సమాచారం

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: నిర్వహణ పనుల నేపథ్యంలో మంగళవారం ఉదయం 7 గంటల నుంచి 8.30 వరకు ఉడాకాలనీ ఫేజ్-1,2,3,4, కామాక్షినగర్, మహారాజ ఆసుపత్రి ప్రాంతం, బొగ్గులదిబ్బ, కంటోన్మెంట్, బాలాజీ మార్కెట్, కణపాక, కేఎల్‌పురం, ద్వారపూడి, గుంకలాం, అయ్యన్నపేట, దుప్పాడ, జొన్నవలస, సారిక, కోరుకొండ, రాకోడు, పినవేమలి, పాల్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా ఉండదని ఈఈ పి.త్రినాథరావు తెలిపారు.

మహిళ నేత్రదానం

రింగురోడ్డు, న్యూస్‌టుడే: నగరానికి చెందిన సాగి అన్నపూర్ణ సోమవారం తన ఇంట్లో మరణించారు. ఆమె నేత్రాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వైద్యులు ఆర్.రాజ్‌కుమార్, జి.వెంకటేశ్వరరావు, తారకేశ్వరరావు కార్నియాలను సేకరించారు. డీఎంహెచ్‌వో భాస్కరరావు, రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ ప్రసాద్ అభినందించారు.

దీపారాధన... కంటోన్మెంట్: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు సనాతన ధర్మ పరిరక్షణ కోసం ప్రాయశ్చిత దీక్ష కార్యక్రమం జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యశస్వి ఆధ్వర్యంలో రింగురోడ్డు కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగింది. ఎమ్మెల్యే అదితి హాజరయ్యారు. నాయకులు రాజేష్‌రాజు, విజయ్, సుధీర్, మహాలక్ష్మి పాల్గొన్నారు.



డీఈ బాధ్యతలు స్వీకారం

ఎస్.కోట: జలవనరుల శాఖ ఎస్.కోట సెక్షను డీఈగా శ్రీచరణ్ బాధ్యతలు స్వీకరించారు. విశాఖ నుంచి ఈయన ఇక్కడకు వచ్చారు. జేఈలు స్వాగతం పలికారు.

సేవలతోనే గుర్తింపు...: నెల్లిమర్ల: ప్రస్తుత సమాజంలో ఉద్యోగులకు సేవలతోనే గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్సీలు పి.సూర్యనారాయణరాజు, పి.రఘువర్మ అన్నారు. మొయిద పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన బొట్టా రాధాదేవి దంపతులను వారు సత్కరించారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

విజయనగరం వైద్య విభాగం: ఎయిడ్స్ బారిన పడకుండా అంతా జాగ్రత్తలు తీసుకోవాలని ఎయిడ్స్ నియంత్రణ సంస్థ పీఎం కె.గౌరి సూచించారు. నగరంలో జరిగిన సదస్సులో మాట్లాడారు.

సీఐగా లక్ష్మణరావు బాధ్యతల స్వీకరణ

విజయనగరం నేరవార్తా విభాగం: విజయనగరం సీఐగా బి.లక్ష్మణరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

సత్కారం



విజయనగరం అర్బన్: జమ్ము నారాయణపురం ఎంపీయూపీ పాఠశాలలో సహాయకునిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన మక్కువ బాలకృష్ణను సోమవారం సత్కరించారు. ఎంఈవోలు సి.హెచ్.ఆనందమూర్తి, పి.సత్యవతి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన భగత్‌సింగ్ ఫెస్ట్


థింసా నృత్యం చేస్తున్న విద్యార్థినులు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నగరంలోని గురజాడ కళాభారతిలో మూడు రోజులుగా జరుగుతున్న భగత్‌సింగ్ ఫెస్ట్ సోమవారంతో ముగిసింది. వివిధ కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులంతా ప్రదర్శనలతో హోరెత్తించారు. తప్పెటగుళ్లు, కోలాటం, రేలారే రేలా ఆకట్టుకున్నాయి. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి బి.అశోక్, ఉపాధ్యక్షుడు పి.రామ్మోహన్, జేవీవీ నాయకులు వెంకటరావు, కృష్ణాజీ, గిరిజన సంఘం నాయకులు ఈశ్వరరావు, ప్రజానాట్య మండలి నాయకుడు రమణ పాల్గొన్నారు.

అర్హులంతా ఓటు హక్కు పొందాలి

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: అర్హులైన ఉపాధ్యాయులంతా ఓటు హక్కు పొందాలని ఏపీటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బంకురు జోగినాయుడు అన్నారు. ఎల్.కోటలోని పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. రాష్ట్ర సంఘం ఆమోదం మేరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మకు ఏపీటీఎఫ్ తరఫున సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు. 2018 అక్టోబరు నుంచి 2024 సెప్టెంబరు వరకు ఉన్నత, గురుకుల, ఆదర్శ, కస్తూర్బాగాంధీ పాఠశాలల్లో ఆరు నుంచి పదో తరగతి ఆ పైబడిన తరగతులకు బోధిస్తున్న వారు అర్హులన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు


తలపడుతున్న క్రీడాకారులు

కొత్తవలస, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో రెండు రోజులు నిర్వహించే విద్యార్థుల క్రీడా పోటీలు బలిగట్టంలోని ప్రగతి వ్యాయామ విద్య కళాశాల క్రీడా ప్రాంగణంలో సోమవారం ఉత్సాహంగా జరిగాయి. తొలిరోజు అండర్-14, 17 విభాగాల్లో బాలికల పోటీలను జిల్లా కార్యదర్శి కె.కృష్ణంరాజు, కళాశాల వ్యవస్థాపకుడు శ్రీనివాసరావు ప్రారంభించారు. ఎంఈవో జి.శ్రీదేవి పర్యవేక్షించారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, యోగా పోటీల్లో నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 400 మందికి పైగా బాలికలు హాజరయ్యారు. విజేతలను జిల్లా పోటీలకు ఎంపికచేస్తామని పీడీ పాప తెలిపారు.

భూఆక్రమణలపై చర్యలకు వినతి


తహసీల్దారుకు వినతిపత్రమిస్తున్న నాయకులు

ఎస్.కోట, న్యూస్‌టుడే: పట్టణంలో విలువైన ప్రభుత్వ భూముల ఆక్రమణలు తొలగించే చర్యలు తీసుకోవాలని కోరుతూ జనసేన పార్టీ నాయకులు పి.సురేష్‌రాజు, టి.చంటి, ఎం.చిన్ని, జి.సతీష్, డి.రమణ కోరారు. రెవెన్యూ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమంలో తహసీల్దారు అరుణకుమారిని కలిసి వినతిపత్రం అందజేశారు. పుణ్యగిరి రోడ్డులోని ఎస్టీ బాలుర కళాశాల వసతిగృహం సమీపంలో జగనన్న కాలనీకి ఆనుకొని సర్వే నంబరు 168-1లో స్థలం కబ్జాకు గురైందని, విశాఖ-అరకు రోడ్డులో పాఠశాల గోడను ఆనుకొని సర్వే నంబరు 471లో ఆక్రమించి రేకుల షెడ్లు వేశారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.

అంతర్జాతీయ తైక్వాండో పోటీల్లో ప్రకాశం

కొత్తవలస, న్యూస్‌టుడే: మలేషియాలో నిర్వహించిన అంతర్జాతీయ తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీల్లో కొత్తవలస మండలం కంటకాపల్లికి చెందిన తైక్వాండో క్రీడాకారుడు, శిక్షకుడు ములపర్తి ప్రకాశరావు ప్రతిభ కనబర్చి విజేతగా నిలిచి స్వర్ణ పతకం సాధించారు. ఈ సందర్భంగా ఆయన 'న్యూస్‌టుడే'కు వివరాలు తెలిపారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించిన ఈ పోటీలకు భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించారు. పోటీలో సత్తా చాటి ఫైనల్స్‌కు చేరుకుని మలేషియా క్రీడాకారుడిపై గెలిచి స్వర్ణం సాధించారు. గురువు పి.రుక్మాకరరావు, డి.పోలారావు, తిరుపతిరాజు, ఉషారాణి, విశ్వేశ్వరరావు, డీఎల్‌కే రావు, కొత్తవలస ఎఫ్‌బీసీ ప్రోత్సాహమే కారణమన్నారు.


బంగారు పతకంతో ప్రకాశరావు